
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5

పార్వతీపురం మన్యం
జిల్లా వార్తలు
శుక్రవారం 18 ఏప్రిల్ 2025


పెద్దగెడ్డ రిజర్వాయర్

ప్రాజెక్టులు ఇక్కడ.. సర్కిల్ ఆఫీస్ అక్కడ

పార్వతీపురం, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని సాగునీటి ప్రాజెక్టుల ద్వారా ఆయకట్టు రైతులకు సక్రమంగా సాగునీరు అందించడంతో పాటు వారికి ఏ సమస్య ఎదురైనా దాన్ని పరిష్కరించాల్సిన బాధ్యత ఇంజనీరింగ్ అధికారులపై ఉంది. దీనికోసం ఉన్నత స్థాయి అధికారులతో పాటు ఇతర అధికారులు రైతులకు అందుబాటులో ఉండాలి. కానీ, ఆ పరిస్థితి జిల్లాలో ఎక్కడా కనిపించడం లేదు. జిల్లాలో ఇరిగేషన్ కార్యాలయం ఎక్కడ ఉందో అనేక మంది రైతులకు తెలియదంటే అతిశయోక్తి కాదు. జిల్లా కేంద్రం పార్వతీపురంలో సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి నిర్మాణం కోసం అక్కడ ఉన్న ఇరిగేషన్ కార్యాలయాన్ని తొలగించారు. దీంతో జిల్లా కేంద్రంలోని ఒక ప్రభుత్వ క్వార్టర్స్‌లో ఇరిగేషన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీరింగ్ కార్యాలయాన్ని నిర్వహిస్తున్నారు. కానీ, ఉన్నత ఇంజనీరింగ్ అధికారులు మాత్రం విజయనగరం జిల్లా బొబ్బిలిలో ఉన్న సర్కిల్ కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్నారు. ఫలితంగా రైతులకు ఏమైనా సమస్యలు ఉంటే ఉన్నతాధికారులకు చెప్పుకునేందుకు బొబ్బిలికి వెళ్లలేకపోతున్నారు. పార్వతీపురానికి వెళితే సూపరింటెండెంట్ ఇంజనీర్ స్థాయి అధికారి లేకపోవడంతో ఆయకట్టు రైతులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

నాలుగేళ్లవుతున్నా ఇంతే..

పార్వతీపురం మన్యం జిల్లా ఏర్పడి నాలుగేళ్లు అవుతున్నా ఇరిగేషన్ సర్కిల్ కార్యాలయం బొబ్బిలిలోనే కొనసాగుతుంది. దీని పరిధిలోని ప్రాజెక్టులు మాత్రం పార్వతీపురం మన్యం జిల్లా పరిధిలోనే ఉన్నాయి. వెంగళరాయ సాగర్, పెదంకలాం, పెద్దగెడ్డ రిజర్వాయర్ తదితర ప్రాజెక్టులు బొబ్బిలి సర్కిల్‌లో ఉన్నాయి. జిల్లాలో ఇరిగేషన్ శాఖపై రాష్ట్ర మంత్రులు గానీ, ఉన్నతాధికారులు గానీ సమీక్షలు నిర్వహిస్తే కేవలం ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ స్థాయి అధికారి మాత్రమే హాజరవుతున్నారు తప్ప సూపరింటెండెంట్ ఇంజనీర్ హాజరు కావడం లేదు. దీనివల్ల సమస్యలు పూర్తిస్థాయిలో పరిష్కారానికి నోచుకోవడం లేదు. బొబ్బిలి సర్కిల్ కార్యాలయంలో పనిచేసే అధికారులు, ఉద్యోగులు దూర ప్రాంతాల నుంచి రాకపోకలు (మిగతా 8వ పేజీలో..)

- బొబ్బిలిలో ఇరిగేషన్ ఎస్ఈ విధులు
- పార్వతీపురంలో కొనసాగుతున్న ఈఈ కార్యాలయం
- సమస్యలు విన్నవించేందుకు రైతుల ఇబ్బందులు
- నాలుగేళ్లుగా ఇదే పరిస్థితి



బొబ్బిలిలో ఉన్న ఇరిగేషన్ సర్కిల్ కార్యాలయం

అభివృద్ధికి నోచుకోని మక్కువ బైపాస్ - రైల్వేస్టేషన్ రోడ్డు


పండగలోపు పనులు పూర్తయ్యేనా?

- శ్యామలాంబ ఉత్సవాలకు నెలరోజులే సమయం
- సాలూరు మునిసిపాలిటీలో కానరాని రోడ్ల నిర్మాణం
- నిధులున్నా నిర్లక్ష్యమెందుకో?
- భక్తుల్లో ఆందోళన

సాలూరు, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): సాలూరు గ్రామదేవత శ్యామలాంబ అమ్మవారి ఉత్సవాలు మరో నెల రోజుల్లో ప్రారంభంకానున్నాయి. మే 18,19,20 తేదీల్లో అమ్మవారి పండగను జరిపేందుకు ముహూర్తాలు సైతం తీశారు. 15 ఏళ్ల తరువాత శ్యామలాంబ ఉత్సవాలు జరగనుండడంతో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అధికారులు ఏర్పాట్లు చేయాల్సి ఉంది. కానీ, ఎక్కడ సమస్యలు అక్కడే ఉన్నాయి. ముఖ్యంగా రహదారుల నిర్మాణం జరగడం లేదు. నిధులున్నా పనులు చేపట్టడంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. 2022-23లో మొదటి విడత అన్‌టైడ్ గ్రాంట్ కింద రూ.68 లక్షలతో పది తారు రోడ్ల నిర్మాణానికి ప్రతి పాదించారు. గతేడాది నవంబరులో పాలకవర్గం కూడా ఆమోదించింది. అత్యవసర పనులుగా భావించి అధికారులు కార్యనిర్వాహక ఇంజనీర్‌కు పంపించారు. అనుమతులు ఆలస్యంగా రావటంతో ఇప్పటి వరకు టెండర్లు కూడా పిలవలేదు. శ్యామలాంబ ఉత్సవాలకు నెలరోజులే గడువు ఉండడంతో అప్పటిలోగా పనులు పూర్తిచేస్తారా? లేదా అని భక్తులు ఆందోళన చెందుతున్నారు.

ఇదీ పరిస్థితి..

సాలూరు శివాజీ బొమ్మ కూడలి నుంచి నాయుడువీధి, వేదసమాజం మీదుగా గాంధీ నగర్ వరకు తారు రోడ్డు నిర్మాణానికి ఆరు నెలల కిందట శంకుస్థాపన చేశారు. దీనికి మూడేళ్ల కిందటే రూ.24 లక్షలు కేటాయించారు. కానీ, ఇప్పటి వరకు పనులు ప్రారంభించలేదు. ఈ మార్గంలో అమ్మవారి సిరిమానోత్సవం జరగనుంది. రోడ్డు పనులు ఇప్పటి వరకు చేయకపోవడంతో గుంతల దారిలో సిరిమాను తిప్పక తప్పదా..? అని భక్తులు ఆందోళన చెందుతున్నారు. రూ.16 లక్షలతో ఎన్టీఆర్ కూడలి నుంచి రైల్వేస్టేషన్ రోడ్డు జంక్షన్ వరకు, రూ.10 లక్షలతో రైల్వేస్టేషన్ కూడలి నుంచి మక్కువ బైపాస్ రోడ్డు వరకు, రూ.9 లక్షలతో పెదకోమటిపేట రోడ్డు నుంచి చిట్లువీధికి, రూ.16 లక్షలతో శివాజీ బొమ్మ జంక్షన్ నుంచి జూనియర్ కాలేజీకి, రూ.12 లక్షలతో రామాకాలనీ, క్రిస్టియన్‌కాలనీ నుంచి వివేకానంద స్కూల్ వరకు, రూ.10లక్షలతో బంగారమ్మకాలనీ అంజనేయస్వామి ఆలయం నుంచి మజ్జులపేట రిజర్వాయర్ వరకు, రూ.10 లక్షలతో రామాకాలనీ నుంచి లక్ష్మీ అపార్ట్‌మెంట్స్ వరకు, రూ.10 లక్షలతో అటవీశాఖ కార్యాలయం నుంచి నీటి పథకం వరకు రోడ్లు నిర్మించాల్సి ఉంది. అయితే, నిధులు ఉన్నా అధికారుల నిర్లక్ష్యం (మిగతా 8వ పేజీలో..)


వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్, జాయింట్ కలెక్టర్ శోభిక

తాగునీటి సమస్య ఉండరాదు

- ఇసుక నిల్వలు సిద్ధం చేసుకోవాలి
- పార్వతీపురం, శ్రీకాకుళం అధికారులు సమన్వయంతో పనిచేయాలి
- ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్ ఆదేశం

పార్వతీపురం, ఏప్రిల్17(ఆంధ్రజ్యోతి): తాగునీటి సమస్య ఎక్కడా తలెత్తరాదని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ అన్నారు. తాగునీరు, ఇసుక, ఎంఎస్ ఎంఈ సర్వే, స్వర్ణ ఆంధ్ర-స్వచ్ఛ ఆంధ్ర తదితర అంశాలపై జిల్లా కలెక్టర్లతో ఆయన గురువారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. తాగునీటి అంశంపై సీఎం చంద్రబాబు ప్రత్యేక దృష్టి సారించారని తెలిపారు. ఎక్కడ సమస్య తలెత్తినా తక్షణం చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. నిధులకు కొరత లేదని స్పష్టం చేశారు. 'వేసవి దృష్ట్యా పశువుల తాగునీటిపైనా శ్రద్ధ వహించాలి. పీఎం సూర్య ఘర్ క్రింద సౌర విద్యుత్ ఏర్పాటుకు స్థలాన్ని గుర్తించాలి. ప్రైవేట్ వ్యక్తులు ముందుకు వస్తే ఏడాదికి ఒక ఎకరాకు రూ.31 వేలను అద్దెగా చెల్లిస్తాం. వర్షాకాలం అవసరాలను దృష్టిలో పెట్టుకుని ముందుగానే ఇసుక నిల్వలు సిద్ధం చేసుకోవాలి. శ్రీకాకుళం, పార్వతీపురం జిల్లాల అధికారులు సమన్వయంతో పనిచేయాలి. అంతర్ రాష్ట్ర సరిహద్దుల్లో ఇసుక అక్రమ రవాణాపై గట్టి నిఘా పెట్టాలి. ఆసుపత్రుల్లో విద్యుత్ సరఫరా వంటి కనీస సదుపాయాలపై కలెక్టర్లు చర్యలు తీసుకోవాలి. మన మిత్ర, శక్తి యాప్‌లపై విస్తృత ప్రచారం నిర్వహించాలి. ఎంఎస్ ఎంఈ సర్వేను త్వరగా పూర్తి చేయాలి. ఎంఎస్ ఎంఈ పార్కుల ఏర్పాటుకు అవసరమైన భూమిని సేకరించాలి. ప్రతీ మూడో శనివారం స్వర్ణ ఆంధ్ర-స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం నిర్వహించాలి. ప్రజాప్రతినిధులు, ప్రజలను భాగస్వామ్యం చేయాలి. ఈవేస్ట్ రీసైక్లింగ్ థీమ్‌తో ఈ నెల కార్యక్రమం చేపడుతున్నాం. అన్ని శాఖల్లో ఉన్న ఈ వేస్ట్‌ను గుర్తించాలి.' అని ఆయన సూచించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్, జాయింట్ కలెక్టర్ శోభిక, జిల్లా రెవెన్యూ అధికారి కె.హేమలత, ఈపీడీసీఎస్ పర్యవేక్షక ఇంజనీర్ కోడా చలపతిరావు, డ్వామా పీడీ కె.రామచంద్రరావు, ఆర్‌డబ్ల్యూఎస్ ఇంజనీరింగ్ అధికారి ఓ.ప్రభాకరరావు, డీపీవో కొండలరావు, జిల్లా ప్రణాళిక అధికారి పి.వీరరాజు, పార్వతీపురం మునిసిపల్ కమిషనర్ వెంటేశ్వర్లు, జిల్లా పరిశ్రమల అధికారి పి.సీతారాము పాల్గొన్నారు.

యువత సన్మార్గంలో నడవాలి

- ఎస్పీ మాధవరెడ్డి

సీతంపేట రూరల్, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): గిరిజన యువత సన్మార్గంలో నడవాలని ఎస్పీ ఎస్వీ మాధవరెడ్డి అన్నారు. కమ్యూనిటీ పోలీసింగ్‌లో భాగంగా దోనుబాయి పోలీసుల ఆధ్వర్యంలో దోనుబాయి గ్రామంలో ఐదు రోజులుగా నిర్వహిస్తున్న మెగా వాలీ బాల్ టోర్నీ ఫైనల్ గురువారం జరిగింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎస్పీ మాట్లాడారు. క్రీడలతో మానసిక ఉల్లాసం, ఉత్సాహం లభిస్తాయన్నారు. 'గిరిజన ప్రజలు, యువత, విద్యార్థులతో మమేకమవ్వడమే కమ్యూనిటీ పోలీసింగ్ ముఖ్య ఉద్దేశం. దీనిలో భాగంగానే దోనుబాయిలో ఇటీవల వైద్య శిబిరం, ఇప్పుడు మెగా వాలీబాల్ టోర్నీ నిర్వహించాం. గంజాయి, డ్రగ్స్ వంటి వాటికి యువత దూరంగా ఉండాలి. వీటితో యువత బంగారు భవిష్యత్తు నాశనం అవుతుంది. గంజాయి అమ్మినా, రవాణా చేసినా పోలీసు లకు సమాచారం ఇవ్వాలి. వీటి సమాచారం కోసం క్యూఆర్ కోడ్‌ను అందుబాటులో ఉంచాం. గంజాయి రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటుంది. దీనికి ప్రజల సహకారం ఎంతో అవసరం. సైబర్ నేర గాళ్లపై అందరూ అప్ర మత్తంగా ఉండాలి.' అని అన్నారు. అనంతరం మెగా వాలీ బాల్ ఫైనల్‌లో తలపడిన పొల్ల కాలనీ, దుగ్గి టీం సభ్యులను ఎస్పీ పరిచయం చేసుకున్నారు. వాలీబాల్ సర్వీస్ చేసి పోటీని ప్రారంభించారు. ఈ టోర్నీలో మొత్తం 44 టీంలు పాల్గొనగా వీటిలో దుగ్గి జట్టు విజేతగా నిలిచింది. పొల్ల కాలనీ ద్వితీయ, పెద్ద పల్లంకి తృతీయ స్థానంలో నిలిచాయి. వీరికి నగదు బహుమతితో పాటు మెమెంటోలను ఎస్పీ అందజేశారు. క్రీడాకారులకు వాలీబాల్ కిట్లు, స్పోర్ట్స్ డ్రెస్‌లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పాలకొండ సీఐ ఎం.చంద్రమౌళి, దోనుబాయి, వీరఘట్టం, బత్తిలి, సీతంపేట ఎస్ఐలు మస్తాన్, అమ్మనరావు, అనిల్, కళాధర్, ఏఎస్ఐ త్రినాథరావు, ట్రైనీ ఎస్ఐలతో పాటు ఎంపీపీ ఆదినారాయణ, దోనుబాయి పీహెచ్‌సీ వైద్యాధికారి భానుప్రతాప్, పీడీ ఆర్‌సీ రెడ్డి, రవి పాల్గొన్నారు.


వాలీబాల్ సర్వీస్ చేస్తున్న ఎస్పీ మాధవరెడ్డి

ఘన సంపద మన సొంతం.. కాపాడడమే కర్తవ్యం
- జిల్లాలో ఎన్నో చారిత్రక ఆనవాళ్లు
- నేడు ప్రపంచ వారసత్వ దినోత్సవం
6లో



పక్షులేం చేశాయి పాపం?
6లో
- పదుల సంఖ్యలో మృత్యువాత
- విష ప్రయోగమే కారణమని అనుమానాలు

ఏసీబీ వలలో బొడ్డవలస వీఆర్వో

- ల్యాండ్ మ్యూటేషన్ కోసం రూ.15వేలు డిమాండ్
- రైతు నుంచి రూ.13వేలు తీసుకుంటూ పట్టుబడ్డ వైనం

డెంకాడ, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): రైతు నుంచి లంచం తీసుకుంటూ బొడ్డవలస వీఆర్వో శ్రీనివాసరావు ఏసీబీకి పట్టుబడ్డాడు. మ్యూటేషన్ కోసం రూ.15వేలు డిమాండ్ చేసిన ఆయన రైతు నుంచి రూ.13వేలు తీసుకుంటూ రెడ్‌హ్యాండెడ్‌గా దొరికిపోయాడు. ఈ ఘటన జిల్లా రెవెన్యూ విభాగంలో కలకలం సృష్టించింది. ఏసీబీ డీఎస్పీ వీవీఎస్ఎస్ రమణమూర్తి తెలిపిన వివరాలిలా ఉన్నాయి.

డెంకాడ మండలం ఆకులపేట గ్రామానికి చెందిన రైతు పతివాడ అప్పలనైడి గతేడాది డిసెంబరులో చనిపోయారు. ఆయన పేరుమీద ఆకులపేటలో 28 సెంట్ల భూమి ఉంది. ఆయన కుమారుడు పతివాడ త్రినాథరావు భూమిని తన తల్లి పేరుమీద మ్యూటేషన్ చేయాలని కోరుతూ ఈ నెల 2వ తేదీన తహసీల్దార్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకున్నారు. భూముల పరిధి బొడ్డవలస పంచాయతీ కావడంతో వీఆర్వో ఎ.శ్రీనివాసరావును సంప్రదించాడు. మ్యుటేషన్ కావాలంటే రూ.15వేలు లంచం ఇవ్వాల్సి ఉంటుందని వీఆర్వో చెప్పాడు. తమది పేద కుటుంబమని, లంచం ఇచ్చుకోలేనని రైతు బతిమాలినా వీఆర్వో తగ్గలేదు. కనీసం రూ.13వేలు అయినా ఇవ్వాలన్నాడు. దీంతో త్రినాథరావు ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. వారి సూచన మేరకు గురువారం ఉదయం వీఆర్వో శ్రీనివాసరావు ఇంటికి రైతు బయలుదేరాడు. విజయనగరంలో వాకింగ్‌లో ఉన్న వీఆర్వోకు డబ్బులిచ్చాడు. రైతు నుంచి లంచం రూ.13వేలు తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఈ సందర్భంగా ఏసీబీ డీఎస్పీ మాట్లాడుతూ ఎవరైనా ప్రభుత్వ అధికారులు, ఉద్యోగులు లంచం డిమాండ్ చేస్తే తమకు సమాచారం అందించాలని సూచించారు. దాడుల్లో ఏసీబీ సీఐ ఎం.మహేశ్వరరావు, సీఐ వాసు నారాయణ, విజయనగరం ఏసీబీ సిబ్బంది పాల్గొన్నారు.


ఏసీబీకి చిక్కిన బొడ్డవలస వీఆర్వో శ్రీనివాస్ (బ్లాక్ టీషర్ట్)


నుజ్జయిన ఆటో ముందుభాగం

బ్యాంకు నుంచి వస్తుండగా..

- ట్రాక్టర్‌ను ఢీకొన్న ఆటో
- తొమ్మిది మందికి గాయాలు
- బాధితులంతా రంగంపేట వాసులే..

సీతానగరం, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): మండలంలోని చినభోగిలి గ్రామ సమీపంలో గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో తొమ్మిది మందికి గాయాలయ్యాయి. పోలీసుల వివరాల ప్రకారం.. మండలంలోని రంగంపేట గ్రామానికి చెందిన 10 మంది మహిళలు చినభోగిలిలోని ఓ బ్యాంకులో పని చూసుకుని తిరిగి ఆటోలో ఇంటికి బయలుదేరారు. చినభోగిలి సమీపంలోని ఓ డాబా దగ్గర బొబ్బిలి వైపు వెళుతున్న ట్రాక్టర్‌ను నెమ్మది చేయడంతో వెనుక వస్తున్న ఆటో కంట్రోల్ చేయలేక దాన్ని ఢీకొంది. ఈ ఘటనలో తొమ్మిది మంది మహిళలకు స్వల్ప గాయాలయ్యాయి. వీరిని బొబ్బిలి ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై బాధితురాలు పి.రమాదేవి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ఎం.రాజేష్ తెలిపారు.


క్షతగాత్రులు

ఘన సంపద మన సొంతం.. కాపాడడమే కర్తవ్యం

● జిల్లాలో ఎన్నో చారిత్రక ఆనవాళ్లు
● నేడు ప్రపంచ వారసత్వ దినోత్సవం


విజయనగరం కోట

ప్రభుత్వ చొరవ ఏదీ?

చారిత్రక కట్టడాల పరిరక్షణకు దశాబ్దాల తరబడి ప్రతిపాదనలను రూపొందించడమే తప్ప సరిపడే నిధులను మంజూరు చేసేలా ఇటు అధికారులు... అటు ప్రజాప్రతినిధులు చొరవ చూపిన దాఖలాలు లేవు. పురాతనమైన కట్టడాల ఉనికికి ముప్పు లేకుండా కాపాడాలన్నా... కనీసం వెల్ల వేయాలన్నా లక్షలాది రూపాయలు అవసరం. ఇది ప్రభుత్వాలు తలచుకుంటే గానీ సాధ్యపడదు. మన పూర్వీకుల నుంచి సంక్రమించిన అపూర్వ సంపదను భవిష్యత్ తరాల వారికి సజీవంగా అందించేందుకు పాలకులు, అధికారులు చిత్తశుద్ధితో ప్రయత్నం చేయాల్సిన అవసరం ఉంది.

బొబ్బిలి, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి)

విజయనగరం.. ఈ పేరు చెబితే కళలు... కళాకారుల వైభవమే కాదు... రాజుల పౌరుషం... చారిత్రక నేపథ్యమూ మనకు గుర్తుకు వస్తాయి. పూర్వీకులు అందించిన వారసత్వ సంపద గుర్తుకు వస్తుంది. దీనికి ఎన్నో సాక్ష్యాలు ఉన్నాయి. శుక్రవారం 'ప్రపంచ వారసత్వ దినోత్సవం' సందర్భంగా వాటిని గుర్తు చేసుకోవడం.. రేపటి తరాలకు ఈ ఘన వారసత్వాన్ని అందించేందుకు అనుసరించాల్సిన పద్ధతులపై దృష్టి పెట్టాల్సిన అవసరం ఉంది. దేశ చారిత్రక సంపదను పరిరక్షించుకోవాలన్న లక్ష్యంతో 2015లో కేంద్ర ప్రభుత్వం హెరిటేజ్ సిటీ డెవలప్‌మెంట్ అండ్ అగ్మెంటేషన్ యోజన (హృదయ్) పథకాన్ని ప్రారంభించింది. దేశవ్యాప్తంగా 12 చారిత్రక నగరాలను ఎంపిక చేసి... ఆ ప్రాంతాలలో ప్రాచీన కట్టడాలను పరిరక్షించాలని సంకల్పించింది. ఇలా 77 కట్టడాలను గుర్తించారు. విజయనగరం జిల్లా కేంద్రంలోని కోట, రామతీర్థం వీటిలో ఉండడం గమనార్హం.


బొబ్బిలి వేణుగోపాలుని ఆలయం


రామతీర్థం ఆలయం

ఇంకా ఎన్నో...

విజయనగరం జిల్లాలో ఎన్నో చారిత్రక కట్టడాలు ఉన్న సంగతి తెలిసిందే. విజయనగరంలోని కోట, గంటస్తంభం, మోతీమహల్, కోరుకొండ ప్యాలెస్, రామతీర్థం, బొబ్బిలి కోట, యుద్ధస్తంభం, వేణుగోపాలస్వామి ఆలయం, రాజావారి గెస్ట్‌హౌస్, కుమిలి ఆలయం, నీలావతి బౌద్ధ స్థూపాలు వంటి చారిత్రక సంపదను పరిరక్షించుకునేందుకు ప్రభుత్వం దృష్టి పెట్టాల్సిన అవసరం ఉంది. అదే సమయంలో స్థానికులూ ఈ దిశగా చొరవ చూపించాల్సి ఉంది. బొబ్బిలిలో గల కోట, రాజావారి గెస్ట్‌హౌస్‌లలో అనేక సినిమాల చిత్రీకరణ కూడా జరిగింది. వాటి నిర్మాణ కౌశలం అద్భుతంగా ఉంటుంది. వేణుగోపాలస్వామి ఆలయం నాటి ఇంజనీరింగ్ గొప్పతనానికి తార్కాణంగా నిలుస్తుందని దేవదాయ శాఖకు చెందిన స్థపతులు గతంలో మెచ్చుకున్నారు. వాటి సౌందర్యం దెబ్బతినకుండా ప్రత్యేక నిపుణులతో అరకొర నిధులతో దేవదాయ శాఖ అధికారులు ఎనిమిదేళ్ల క్రితం పనులు చేయించారు. కట్టడం శిథిలం కాకుండా మెరుగులు దిద్దారు. బొబ్బిలి రాజవంశీయులు కూడా దీనికి తమ సొంత నిధులను వెచ్చించారు.


బొబ్బిలి కోట

సొంత నిధులతో కాపాడుకుంటున్నాం..

బొబ్బిలికి ఒక ప్రత్యేకత ఉంది. మా పూర్వీకుల నుంచి సంక్రమించిన ప్రాచీన కట్టడాలను, భవంతులను నిర్వహించడం చాలా భారంతో కూడుకున్నది. అయినప్పటికీ సొంత నిధులతో ఈ వారసత్వపు ఆస్తులను కాపాడుకుంటూ వస్తున్నాం. వేణుగోపాలస్వామి ఆలయ కట్టడం అరుదైనది. దాని అసలు స్వరూపం దెబ్బతినకుండా ఉండాలనే తపనతో స్థపతుల సూచనలతో శాండ్ బ్లాస్టింగ్ ద్వారా హంగులు సమకూర్చుకుంటున్నాం. కోటలో మ్యూజియం, గెస్ట్‌హౌస్, యుద్ధస్తంభం వంటి వాటి విశిష్టతను ఈతరం వారికి తెలియజేసేందుకు మావంతు ప్రయత్నం చేస్తున్నాం.

-బేబీనాయన, ఎమ్మెల్యే, రాజవంశీయుడు

ఆర్పీల వ్యవస్థ బలోపేతమే లక్ష్యం

● మెప్మా పీడీ చిట్టిరాజు

బొబ్బిలి, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): ఆర్పీల వ్యవస్థ బలోపేతమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ముందుకెళుతోందని మెప్మా పీడీ చిట్టిరాజు తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా మున్సిపాలిటీలలో పనిచేస్తున్న మెప్మా రిసోర్స్‌పర్సన్లు (ఆర్పీలు) తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఈ నెల 10 నుంచి సమ్మెలో ఉన్నారు. ఈ నేపథ్యంలో బొబ్బిలి మున్సిపాలిటీలో గురువారం మెప్మా ప్రాజెక్ట్ డైరెక్టర్ చిట్టిరాజు జిల్లాకు చెందిన నాలుగు మున్సిపాలిటీల ఆర్పీలతో చర్చించారు. విజయనగరం, బొబ్బిలి, రాజాం, నెలిమర్ల మున్సిపాలిటీలకు చెందిన ఆర్పీలు పీడీని కలిసి తమ సమస్యలను తెలియజేశారు. ఈ సందర్భంగా పీడీ మాట్లాడుతూ ఆర్పీల వ్యవస్థను బలోపేతం చేయడమే ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు. ఆర్పీల న్యాయమైన సమస్యలన్నిటినీ సత్వరం పరిష్కరించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని తెలిపారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి దృష్ట్యా జీతాల పెంపు ఇప్పటికిప్పుడు సాధ్యం కాదన్నారు. ఆర్పీలకు ఆదాయ మార్గాలు పెరిగేలా అనేక చర్యలు తీసుకున్నారని వివరించారు. కామన్ సర్వీసు సెంటర్లు (సీఎస్‌సి) ఆర్పీలకు అప్పగించే యోచన ఉందన్నారు. గుర్తింపు కార్డులు, యూనిఫామ్, ట్యాబ్‌లు వంటివి అందజేయనున్నట్టు ఆయన చెప్పారు. కొత్తగా వచ్చే యాప్‌లతో పని సులభ తరమవుతుంది తప్ప ఇబ్బంది ఉండదని గ్రహించాలన్నారు. ఆర్పీల సమస్యలన్నిటినీ ప్రభుత్వానికి నివేదిస్తానని పీడీ చిట్టిరాజు వారికి వివరించారు. సీఎంఎం లలిత తదితరులు పాల్గొన్నారు.


ఆర్పీలను ఉద్దేశించి మాట్లాడుతున్న మెప్మా పీడీ చిట్టిరాజు


చిత్రకళా పోటీల్లో సాధించిన బహుమతులతో విద్యార్థులు

చిత్రాలతో మెరిసి... పతకాలతో మురిసి

పూసపాటిరేగ, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): విజయవాడలో ఈ నెల 5న నిర్వహించిన జాతీయ స్థాయి చిత్రలేఖన పోటీల్లో స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు మంచి ప్రతిభ కనబరిచారు. ఈ పాఠశాలకు చెందిన విద్యార్థులు 40 చిత్రాలను పోటీలకు పంపించారు. ఇందులో 6 చిత్రాలకు బంగారు పతకాలు, 8 కాంస్య పతకాలు, 24 మందికి మెరిట్ సర్టిఫికెట్లను నిర్వాహకులు అందించారు. ఈ విద్యార్థులకు శిక్షణనిచ్చిన డ్రాయింగ్ టీచర్ చినసత్యనారాయణను పాఠశాల హెచ్ఎం బలివాడ శంకరరావు, ఉపాధ్యాయులు అభినందించారు.

రాజకీయ పార్టీల భాగస్వామ్యం అవసరం: డీఆర్వో

విజయనగరం కలెక్టరేట్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): పోలింగ్ కేంద్రాలు, ఓటర్ల రేషనలైజేషన్ ప్రక్రియలో రాజకీయ పార్టీలు భాగస్వాములు కావాలని డీఆర్వో శ్రీనివాసమూర్తి కోరారు. దీని కోసం ముందుగానే తమ ఏజెంట్ల ద్వారా క్షేత్ర స్థాయిలో అధ్యయనం చేసి... వివరాలను సేకరించాలన్నారు. దీని వల్ల రేషనలైజేషన్ ప్రక్రియను సులువుగా పూర్తి చేయవచ్చుని ఆయన సూచించారు. గురువారం సాయంత్రం తన చాంబర్‌లో రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఆర్వో మాట్లాడుతూ ఓటర్ల జాబితాలో పేర్ల నమోదు, తొలగింపు, సవరణ ఇతర క్లయిములకు సంబంధించిన దరఖాస్తుల స్థితిని ఎప్పటికప్పుడు తెలుసుకునే అవకాశాన్ని ఎన్నికల కమిషన్ కల్పించిందని చెప్పారు. ఈ సమావేశంలో ఎన్నికల సూపరింటెండెంట్ భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

పక్షులేం చేశాయి పాపం?

● పదుల సంఖ్యలో మృత్యువాత ● విష ప్రయోగమే కారణమని అనుమానాలు

రేగిడి, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): దేవుదళ హైస్కూల్ ఆవరణలో గురువారం కొన్ని పక్షులు మృత్యువాత పడ్డాయి. ఉదయం పాఠశాల ఆవరణలోని చెట్లపైకి పెద్ద సంఖ్యలో కాకులు చేరుకున్నాయి. కాసేపటికే వాటిలో కొన్ని ప్రాణాలు కోల్పోయి... కింద పడిపోయాయి. వీటిని గమనించిన విద్యార్థులు, ఉపాధ్యాయులు ఆందోళనకు గురయ్యారు. పక్కనే ఉన్న తోటలో కొంతమంది వేటగాళ్లు వీటిని పట్టుకొనేందుకు విషంతో కూడిన ఆహారం పెట్టినట్టు తెలుస్తోంది. ఆ ఆహారాన్ని తిన్న కాకులు ప్రాణాలు కోల్పోయాయి. పాఠశాల ఆవరణలోనే ఇవి మృత్యువాత పడడంతో విద్యార్థులు భయంతో మధ్యాహ్న భోజనం చేయడానికి నిరాకరించినట్టు సమాచారం. పాఠశాలకు కొంత దూరంలో పావురాలు కూడా చనిపోయినట్టు స్థానికులు చెబుతున్నారు. దీనికి విష ప్రయోగమే కారణంగా భావిస్తున్నారు. పక్షులు ప్రాణాలు కోల్పోయిన విషయం తెలుసుకున్న స్థానికులు పాఠశాల వద్దకు చేరుకున్నారు. అక్కడే ఉన్న వేటగాళ్లతో స్థానికులు, పాఠశాల సిబ్బంది వాగ్వాదానికి దిగినట్లు తెలిసింది. దీనిపై కొంతమంది పోలీసులకు సమాచారం అందించారు. ఈ విషయాన్ని ఎస్ఐ నీలావతి వద్ద ప్రస్తావించగా... కొన్ని పక్షులు స్పృహ తప్పి పడి ఉన్నట్టు తెలిసిందన్నారు.


హైస్కూల్ ఆవరణలో పడి ఉన్న కాకులు

ఏదీ పారిశ్రామిక వైభవం?

● మూతపడిన కర్మాగారాలు
● కుంటుపడిన ప్రగతి
● రోడ్డున పడిన కార్మికులు
● ఇదీ రాజాం పరిస్థితి

రాజాం రూరల్, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి):

రాజాం.. ఈ పేరు చెబితే పారిశ్రామిక వైభవం గుర్తుకొస్తుంది. కానీ నేడు ఆ వైభవం కనిపించడం లేదు. నాడు కొత్త పరిశ్రమల స్థాపనకు పారిశ్రామికవేత్తల మధ్య పోటీ ఉండేది. చిన్నదో, పెద్దదో ఏడాదికో పరిశ్రమ ఈ ప్రాంతంలో ఏర్పాటయ్యేది. పారిశ్రామిక పట్టణంగా దేశ పారిశ్రామిక చిత్రపటంలో స్థానం పొందింది. రాష్ట్ర, రాష్ట్రేతర ప్రాంతాలకు చెందిన నిష్ణాతులైన పనివారు ఈ ప్రాంతానికి వలస వచ్చి కర్మాగారాలలో పని చేసేవారు. కాలక్రమంలో పరిశ్రమలను మూసివేసేందుకు పారిశ్రామిక వేత్తలు అదే పోటీని కొనసాగించారు. దీంతో రాజాంలో దాదాపుగా పరిశ్రమలన్నీ మూతపడ్డాయి. కొత్త పరిశ్రమలు రాకపోవడం... ఉన్నవి మూతపడడం.. యాజమాన్యాలు లే-ఆఫ్, లాకౌట్లు ప్రకటించడంతో వందలాది మంది కార్మికులు ప్రత్యామ్నాయంపై దృష్టి పెట్టాల్సి వచ్చింది.

అలా శ్రీకారం..

రాజాంకు చెందిన గ్రంధి మల్లికార్జునరావు (జి.ఎం.ఆర్.), గ్రంధి ఈశ్వరరావు ఈ ప్రాంతంలో పరిశ్రమల స్థాపనకు దశాబ్దాల కిందట శ్రీకారం చుట్టారు. వారి బాటలో పొట్టా, కొత్తా కుటుంబాలతో పాటు మరికొంత మంది ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు పరిశ్రమల స్థాపనపై ఆసక్తి కనబరిచారు. రాజాంలో నెల కొన్న కొన్ని ప్రత్యేక కారణాల రీత్యా కార్మికులతో సంబంధం లేని విద్య, వైద్య సంస్థల ఏర్పాటుకు జి.ఎం.ఆర్. ప్రాధాన్యమిచ్చారు. దేశవ్యాప్తంగా కర్మాగారాలు, నిర్మాణ, విమానయాన రంగంపై దృష్టి కేంద్రీకరించారు.


స్పిన్నింగ్ కర్మాగారం ప్రస్తుతం ఇలా..


రియల్‌ఎస్టేట్‌గా మారిన స్టీల్ కర్మాగారం

అప్పట్లో ఇలా..

రాజాంలో జ్యూట్, స్టీల్, ఆక్వా, జీడిపప్పు, స్పిన్నింగ్, వైర్, నట్ అండ్ బోల్ట్, ఐరన్, డైటెక్స్, కేబుల్, కండక్టర్స్, సిమెంట్, పాలిమర్స్, పైపులు, మినరల్ వాటర్, బిస్కెట్స్, సైకిల్ రిమ్ములు, పాలిథిన్ బ్యాగ్స్, కార్డు బోర్డు షీట్స్, అల్యూమినియం తదితర పరిశ్రమలు ఉండేవి. ఈ పరిశ్రమల్లో వేలాది మంది కార్మికులు ఉపాధి పొందేవారు. కాలక్రమంలో ఒక్కొక్కటిగా పరిశ్రమలకు తాళాలు పడడం ప్రారంభమయ్యాయి. కార్మికులు పొట్ట చేత పట్టుకుని ఇతర ప్రాంతాలకు వలసబాట పట్టారు. ప్రస్తుతం జ్యూట్ మినహా కర్మాగారాలన్నీ మూతపడ్డాయి.

కారణాలెన్నో..

ఈ ప్రాంతంలో పరిశ్రమల మూసివేతకు అనేక కారణాలు ఉన్నాయి. ప్రధానంగా రాష్ట్ర ప్రభుత్వం నుంచి కొత్త పారిశ్రామికవేత్తలకు ప్రోత్సాహం కొరవడింది. సేల్స్‌టాక్స్‌లో రాయితీలు లేవు. విద్యుత్, డీజిల్, పెట్రోల్, రవాణా ఛార్జీలు భారీగా పెరిగాయి. కార్మికుల సమస్య పెరిగింది. కార్మిక చట్టాలు, యూనియన్ల ఒత్తిడి కూడా ఎక్కువైంది. పన్నుల భారం, ప్రభుత్వం మారినప్పుడల్లా పారిశ్రామిక విధానాలు మారడం కూడా పరిశ్రమల మూతకు కారణమని కొందరు పారిశ్రామికవేత్తలు చెబుతున్నారు. పూర్తిస్థాయి అవగాహన లేకుండా కర్మాగారాలు ఏర్పాటు చేసి... చేతులు కాల్చుకుని పరిశ్రమలను మూసివేసిన వారూ లేకపోలేదు. తరచూ మారుతున్న ప్రభుత్వ విధానాలను తట్టుకుని పారిశ్రామికవేత్తలు నిలదొక్కుకోలేకపోవడం కూడా మరో కారణమని అంటున్నారు.

ఔత్సాహికులకు ప్రోత్సాహం కరవు..

ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు ప్రభుత్వం నుంచి ప్రోత్సాహం లేదు. వెనుకబడిన ప్రాంతాలలో పరిశ్రమలు ఏర్పాటు చేస్తే పెట్టుబడిలో 20 శాతం ప్రభుత్వం రాయితీగా ఇచ్చేది. 1985 నుంచి అమలులోకి వచ్చిన ఈ విధానాన్ని కాలక్రమంలో నిలిపివేశారు. పరిశ్రమలకు ప్రభుత్వం నుంచి మూడేళ్ల పాటు ఇచ్చిన విద్యుత్ రాయితీని కూడా నిలిపివేశారు. మూడేళ్లలో హీనపక్షంగా ప్రభుత్వం నుంచి ఒక్కో పరిశ్రమకు రూ.50 లక్షల వరకూ విద్యుత్ రాయితీ అందేది. ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు అమ్మకం పన్నుపై 14 ఏళ్ల పాటు 135 శాతం రాయితీని ప్రభుత్వం కల్పించేది. 2001 నుంచి ఈ రాయితీని కూడా ప్రభుత్వం రద్దు చేసింది. పరిశ్రమల స్థాపనకు ప్రోత్సాహం తగ్గింది. వీటితో పాటు కర్మాగారాలలో సంక్షోభాలతో మూతపడ్డాయి.


మూతపడిన వైర్ పరిశ్రమ

కార్మిక యూనియన్లు..

కార్మిక యూనియన్ల గొంతెమ్మ కోరికలు సైతం రాజాం ప్రాంతంలో కర్మాగారాల మూతకు ఓ కారణంగా చెప్పవచ్చు. 1975లో రాజాంలో జి.ఎం.ఆర్. ఏర్పాటు చేసిన జ్యూట్ కర్మాగారం లాకౌట్ మొదలు ఒక్కొక్కటిగా పరిశ్రమల మూతకు కార్మిక సంఘాల పాత్ర కూడా లేకపోలేదు. కోట్లాది రూపాయలు పెట్టుబడిగా పెట్టి... కార్మిక సంఘాల ధోరణిని తట్టుకోలేక యాజమాన్యాలు కర్మాగారాలకు తాళాలు వేసిన సందర్భాలు ఎన్నో. ఇలా విభిన్న కారణాలతో ఈ ప్రాంతంలో పరిశ్రమలు మూతపడ్డాయి.

ఉపాధి కోల్పోయా..

శ్రీకాకుళం రోడ్‌లోని ఓ వస్త్ర కర్మాగారంలో పదేళ్ల పాటు పనిచేశాను. కారణాలేంటో తెలియదు గానీ కర్మాగారం మూసేశారు. దీంతో ఉపాధిని కోల్పోయాను. యాజమాన్యం ఇచ్చిన డబ్బుతో కూతురి పెళ్లి చేశాను. ప్రస్తుతం ఓ హోటల్‌లో సర్వర్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాను.

-రాజు, అంతకాపల్లి

పరిస్థితి తారుమారైంది..

మా గ్రామంలోని స్టీల్ కర్మాగారంలో 20 ఏళ్లకు పైగా పని చేశాను ఉన్న ఫళంగా ఫ్యాక్టరీ మూతపడడంతో పరిస్థితి తారుమారైంది. కొన్నాళ్ల పాటు ఆటో నడిపాను. శరీరం సహకరించక అది కూడా ఆపేశాను. ప్రస్తుతం ఇబ్బందుల్లో ఉన్నాను. ప్రభుత్వం ఇస్తున్న పింఛనుతో కుటుంబాన్ని నెట్టుకొస్తున్నాను.

-రామారావు, కార్మికుడు, పొగిరి

ప్రభుత్వాల విధానాలే కీలకం..

పరిశ్రమల ఏర్పాటుకు, పారిశ్రామికవేత్తలు నిలదొక్కుకునేందుకు ప్రభుత్వ ప్రోత్సాహం ప్రధానం. అమ్మకం పన్ను, విద్యుత్, సేల్స్‌టాక్స్ తదితర అంశాలలో రాయితీలు ప్రకటించాలి. కొత్త పరిశ్రమల ఏర్పాటుకు తక్కువ ధరకు భూమిని కేటాయించాలి. ఇవేవీ ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. కార్మిక సంఘాల ఒత్తిడి కూడా పరిశ్రమల మూతకు ఓ కారణంగా చెప్పక తప్పదు. ఫలితంగా ఉన్న కర్మాగారాలన్నీ మూతపడ్డాయి. గతంతో పోలిస్తే భూముల ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. ఈ పరిస్థితుల్లో కొత్త పరిశ్రమల ఏర్పాటు అసాధ్యమనే చెప్పాలి.

-పొట్టా సత్యనారాయణ గుప్త, పారిశ్రామికవేత్త

అవస్థలు తప్పాయ్

మధుపాడ రోడ్డుకు కొత్తరూపు



గతంలో మధుపాడ రోడ్డు దుస్థితి

గంట్యాడ ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): గతంలో మధుపాడ రోడ్డు యావత్తూ గోతులతో దర్శనమిచ్చేది. అడుగు తీసి అడుగు వేయలేని దుస్థితి ఉండేది. ఈ క్షణాన ఏం జరుగుతుందోనన్న ఆందోళన వాహనదారులు, స్థానికులను వెంటాడేది. వర్షాకాలంలో ఆ బాధలు రెట్టింపు అయ్యేవి. దాంతో సుమారు ఆరు గ్రామాల ప్రజలు నానా అవస్థలు పడేవారు. వర్షాకాలంలో రోడ్డు యావత్తూ చెరువులా తలపించింది. ఇప్పుడు నాటి పరిస్థితులకు భిన్నంగా రోడ్డు కొత్త రూపు దాల్చింది. దీంతో స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ రోడ్డు మరమ్మతుల చేపట్టాలని కోరుతూ స్థానికులు పలుమార్లు ఆందోళనకు దిగారు. ఈ రోడ్డు జీవీఎంసీ పరిధిలో ఉండటంతో సమస్య పరిష్కారం కాలేదు. ఎట్టకేలకు రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం కొలువుదీరడంతో రాష్ట్ర మంత్రి కొండపల్లి శ్రీనివాస్ దృష్టికి రహదారి సమస్యను స్థానికులు తీసుకెళ్లారు. ఆయన స్పందించి జీవీఎంసీ నిధులు మంజూరు చేసేలా చర్యలు తీసుకున్నారు. దాంతో తాటిపూడి నుంచి కృష్ణాపురం వరకూ సుమారు 6 కిలోమీటర్ల రోడ్డు దాదాపు పూర్తయ్యింది.



నేడు తారు రోడ్డుగా..

అఖిల వైద్య ఖర్చుల చెల్లింపు

విజయనగరం కలెక్టరేట్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): గరివిడి మండలం శివరాంలో ఈనెల 5 యువకుడి దాడికి గురై నగరంలోని ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందిన కోండ్రు అఖిల (16)ను గురువారం వైద్యులు డిశ్చార్జ్ చేశారని కలెక్టర్ అంబేడ్కర్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. 12 రోజుల పాటు ఆసుపత్రిలో ఆమె వైద్యానికి రాష్ట్ర ప్రభుత్వం రూ.1,85,837 చెల్లించిందని తెలిపారు.

క్యాబినెట్ ఆమోదం హర్షణీయం

గజపతినగరం, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ ఉప వర్గీకరణకు రాష్ట్ర క్యాబినెట్‌లో ఆమోదం తెలపడం హర్షణీయమని టీడీపీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు సున్నపు రామస్వామి అన్నారు. గురువారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాజీ ఎంపీపీ కొండపల్లి కొండలరావుతో కలిసి ఆయన మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణ కింద గ్రూప్-1లో 12 ఉప కులాలకు ఒక శాతం, గ్రూప్-2లో 18 ఉప కులాలకు 6.5 శాతం, గ్రూప్-3లో 29 ఉప కులాలకు 7.5 శాతం రిజర్వేషన్ల అమలుకు ఆమోదం తెలపడం అభినందనీయమన్నారు. సమావేశంలో మాజీ ఎంపీపీ దేముడమ్మ, పి.శంకరరావు, గణేశ్ తదితరులు పాల్గొన్నారు.

● నెల్లిమర్ల: సీఎం చంద్రబాబుకు రాష్ట్రంలోని దళితులు రుణపడి ఉంటారని టీడీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి పోతల రాజప్పన్న అన్నారు. నెల్లిమర్లలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలోని జనాభా ప్రాతిపదికన షెడ్యూల్ కులాలు మూడు వర్గాలకు వర్గీకరణ చేయడం సమంజసమన్నారు. దళితుల పట్ల చంద్రబాబుకు ప్రేమాభిమానాలు ఉన్నాయనడానికి ఇదే ఉదాహరణ అన్నారు. సమావేశంలో ఎస్సీ సెల్ నాయకులు దన్నాన గోవింద్, కింతాడ కళావతి, పొడుగు కృష్ణవేణి పాల్గొన్నారు.

రేపు రన్ ఫర్ జీసస్

విజయనగరం బాబామెట్ట, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): ఈస్టర్ పర్వదినాన్ని పురస్కరించుకుని రన్ ఫర్ జీసస్ కార్యక్రమాన్ని ఈనెల 19న విజయనగరం క్రిస్టియన్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్టు స్వీమ్స్ మెమోరియల్ బాప్టిస్ట్ చర్చి కార్యదర్శి ఆర్‌ఎస్ జాన్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 6 గంటలకు కోట, మూడు లాంతర్లు, గంట స్తంభం మీదుగా చర్చి వరకూ ర్యాలీ నిర్వహిస్తామన్నారు. అందరూ విజయంతం చేయాలని కోరారు.

సెలవు ఇవ్వాలని వినతి

శృంగవరపుకోట, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): విజయవాడలో 21న తలపెట్టిన ధర్నాలో పాల్గొనేందుకు సెలవు ఇవ్వాలని పీవో ఉమను అంగన్‌వాడీ యూనియన్ నాయకులు కోరారు. గురువారం పీవోను కలిసి వినతిపత్రం అందజేశారు.

పలు సమస్యలపై వినతులు



వినతులు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే

లక్కవరపుకోట, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలోని ప్రజలు పలు సమస్యలపై ఎమ్మెల్యే లలితకుమారికి గురువారం వినతి పత్రాలను అందించారు. చిన్నచిన్న సమస్యలు 90 శాతం అక్కడికక్కడే పరిష్కరించామని ఎమ్మెల్యే తెలిపారు. కార్యక్రమంలో పలువురు టీడీపీ నేతలు పాల్గొన్నారు.

మళ్లీ భూ ఆక్రమణలు

సంతకవిటి, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అప్పలగ్రహారంలో అక్రమార్కులు మళ్లీ రెచ్చిపోయారు. భూ ఆక్రమణలకు పాల్పడ్డారు. అప్పలగ్రహారంలో సర్వే నెంబర్ 70-1 విస్తీర్ణం ఒకటన్నర సెంటు, 71-1 విస్తీర్ణం ఒక సెంటు, భూమిని ముగ్గురు వ్యక్తులు ఆక్రమించారని స్థానికులు ఈనెల 1న ఫిర్యాదు చేయడంతో రెవెన్యూ అధికారులు స్పందించారు. ప్రభుత్వ భూమిలో ఆక్రమణలను పోలీసుల సాయంతో తొలగించారు. అందుకు సంబంధించిన హద్దులు ఏర్పాటు చేశారు. అయితే అదే స్థలాన్ని గురువారం కొందరు మళ్లీ ఆక్రమించేశారు. విషయాన్ని గుర్తించిన స్థానికులు ఎంపీడీవోకు సురేష్‌కుమార్‌కు ఫిర్యాదు చేశారు. దాంతో ఆయన ఎస్ఐ ఆర్.గోపాలరావు ఫిర్యాదు చేశారు.

22లోగా ఫీజు చెల్లించాలి

గరివిడి, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియట్ సప్లిమెంటరీ, బెటర్‌మెంట్ పరీక్షలకు ఈనెల 22లోగా ఫీజు చెల్లించాలని స్థానిక జీవీఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ మద్దిలి వినోద్‌బాబు ఓ ప్రకటనలో తెలిపారు. ఫీజు చెల్లింపు గడువు పెంచే అవకాశం ఉండదని ఆయన పేర్కొన్నారు.

జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించండి



టీడీపీ నేతలతో చర్చిస్తున్న ఎమ్మెల్యే

విజయనగరం రూరల్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు జన్మదిన వేడుకలను 20న ఘనంగా నిర్వహించాలని ఎమ్మెల్యే అదితి గజపతిరాజు పార్టీ నాయకులను ఆదేశించారు. గురువారం రాత్రి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గ ముఖ్య నాయకులతో ఆమె సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ ఏడాది మరింత ఘనంగా వేడుకలను నిర్వహించేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు.

క్రీడాకారులకు ఎమ్మెల్యే అభినందనలు

విజయనగరం రూరల్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): కృష్ణా జిల్లా గుడివాడలో నిర్వహించిన ఏపీ పవర్ లిఫ్టింగ్ చాంపియన్‌షిప్ పోటీల్లో విజయనగరానికి చెందిన క్రీడాకారులు ఎస్. జీరా సిద్దిఖివి, జి.ఉదయ్‌కృష్ణ, మహ్మద్ ఆరీఫ్ సత్తాచాటారు. గురువారం శిక్షకుడు పెద్ది లక్ష్మీనారాయణతో కలిసి వారు ఎమ్మెల్యే అదితి గజపతిరాజును మర్యాదపూర్వకంగా కలిశారు. దాంతో ఆమె క్రీడాకారులను అభినందించారు. జిల్లాకు పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలని ఆకాంక్షించారు.

పబ్బం గడుపుకోవడానికే వైసీపీ డ్రామాలు



మాట్లాడుతున్న టీడీపీ జిల్లా అధ్యక్షుడు నాగార్జున

విజయనగరం రూరల్, ఏప్రిల్ 17: (ఆంధ్రజ్యోతి): వైసీపీ రాజకీయంగా పబ్బం గడుపుకోవడానికే మతాలు, కులాలు, వర్గాలను విడగొట్టేందుకు డ్రామాలు ఆడుతోందని టీడీపీ జిల్లా అధ్యక్షుడు కిమిడి నాగార్జున విమర్శించారు. గురువారం పార్టీ కార్యాలంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 2019లో విద్వేషాలు రెచ్చగొట్టి వైసీపీ అధికారంలోకి వచ్చిందన్నారు. అధికారంలోకి వచ్చాక ఏ వర్గానికి మేలు చేయకపోవడంతో 11 సీట్లకు పరిమితం చేశారన్నారు. అయినప్పటికీ వైసీపీ నాయకులకు బుద్ధి రాలేదన్నారు. టీటీడీ కోసం మాట్లాడే అర్హత వైసీపీ నాయకులకు లేదన్నారు. పాస్టర్ ప్రవీణ్ మృతి నేపథ్యంలో మతాల మధ్య విధ్వంసాలు సృష్టించాలని వైసీపీ యత్నించిందన్నారు. టీటీడీపై బురదచల్లి హిందువుల మనోభావాలను దెబ్బతీయాలని చూస్తోందన్నారు. ప్రజలు వాటిని నమ్మే స్థితిలో లేరన్నారు. సమావేశంలో పార్టీ నాయకులు కర్రోతు నర్సింగరావు, ఆకిరి ప్రసాదరావు, ఆల్తి బంగారుబాబు, పానీరాజు పాల్గొన్నారు.

నగరాభివృద్ధిలో భాగస్వాములు కండి



ర్యాలీని ప్రారంభిస్తున్న నగరపాలక సంస్థ కమిషనర్

విజయనగరం రింగురోడ్డు, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): నగరవాసులు ఆస్తి పన్ను చెల్లించి నగరాభివృద్ధిలో భాగస్వాములు కావాలని నగరపాలక సంస్థ కమిషనర్ పి. నల్లనయ్య పిలుపునిచ్చారు. గురువారం ఆస్తి పన్నుదారులను చైతన్యపరిచేందుకు వినూత్న రీతిలో క్లాప్ వాహనాలతో పాటు సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ, 2025-26 ఆర్థిక సంవత్సరానికి ఇంటి పన్ను, ఖాళీ స్థలాల పన్ను ఏకమొత్తంలో చెల్లిస్తే ఐదు శాతం రాయితీ సౌకర్యాన్ని, ఐదు శాతం వడ్డీ మాఫీ సౌకర్యాన్ని ప్రభుత్వం కల్పించిందన్నారు. ఈనెల 30లోగా చెల్లించిన వారికి మాత్రమే ఈ అవకాశం వర్తిస్తుందన్నారు. ర్యాలీలో ఆర్‌ఐలు, పారిశుధ్య పర్యవేక్షకులు, కార్యదర్శులు పాల్గొన్నారు.

చెన్నకేశవ భూములపై నివేదిక ఇవ్వండి

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

శృంగవరపుకోట రూరల్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ధర్మవరం చెన్నకేశవస్వామి భూములపై నివేదిక ఇవ్వాలని ఈవో ప్రసాద్‌ను దేవదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్ కె.శిరీష ఆదేశించారు. చెన్నకేశవ స్వామి భూములు అన్యాక్రాంతమయ్యాయని 'ఆ 47 ఎకరాలు ఏమైనట్టో' శీర్షికతో 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనానికి దేవదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్ శిరీష స్పందించారు. భూములపై పూర్తిస్థాయి నివేదిక అందజేయాలని ఆమె ఆదేశించారు.

పథకాలను సద్వినియోగం చేసుకోండి

గజపతినగరం, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పథకాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని అగ్రోస్ జిల్లా అధికారి చంద్రశేఖర్‌బాబు అన్నారు. గురువారం మండలంలోని కొత్తబగ్గాంలోబొత్స అప్పలనాయుడుకు దుక్కు యంత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 50 శాతం రాయితీపై యంత్రాన్ని అందజేశామన్నారు. ఇప్పటికే మండలంలోని కొత్తబగ్గాం, మధుపాడ, కొనిస, రామన్నపేట గ్రామాల్లో రైతులకు అందజేశామన్నారు. కార్యక్రమంలో ఏడీఐ మహరాజన్, ఏవో ధనలక్ష్మి పాల్గొన్నారు.

సమావేశాలను విధిగా నిర్వహించండి

● కలెక్టర్ అంబేడ్కర్



మాట్లాడుతున్న కలెక్టర్ అంబేడ్కర్

విజయనగరం కలెక్టరేట్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): ప్రతి రెవెన్యూ డివిజన్‌లో ప్రతి మూడు నెలలకు ఒకసారి విజిలెన్స్ అండ్ మోనిటరింగ్ కమిటీ సమావేశం నిర్వహించాలని కలెక్టర్ అంబేడ్కర్ ఆదేశించారు. గురువారం మధ్యాహ్నం కలెక్టరేట్ ఆడిటోరియంలో జిల్లా స్థాయి విజిలెన్స్ అండ్ మోనటరింగ్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి నెల 30న అన్ని మండలాల్లో ఎస్‌హెచ్‌వో, తహసీల్దార్ల ఆధ్వర్యంలో సివిల్ రైట్స్ డే నిర్వహించాలని ఆదేశించారు. డీవీఎంసీ సభ్యుడు బసవ సూర్యనారాయణ మాట్లాడుతూ ఎస్సీ కాలనీల్లో కొన్నిచోట్ల శ్మశానాలు లేవని, మరి కొన్నిచోట్ల ఆక్రమణలకు గురయ్యాయని కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. దానిపై కలెక్టర్ స్పందించారు. అందుకు సంబంధించిన నివేదికలను పంపించాలని ఆర్డీవోలను ఆదేశించారు. కొన్ని చోట్ల రెండు గ్లాసుల విధానం ఇంకా అమలవుతుందని సభ్యులు సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. దానిపై అవగాహన కల్పించాలని కలెక్టర్ తెలిపారు. సమావేశంలో ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు, డీఆర్‌వో శ్రీనివాసమూర్తి, ఏఎస్పీ సౌమ్యలత, సోషల్ వెల్ఫేర్ డీడీ రమానందం, సభ్యులు చిట్టిబాబు ఉన్నారు.

కానిస్టేబుల్ కుటుంబానికి రూ.3.60 లక్షలు



ఆర్థిక సాయం చేస్తున్న ఎస్పీ

విజయనగరం క్రైం, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన ఏఆర్ కానిస్టేబుల్ గోపాలరావు కుటుంబానికి సహచర ఉద్యోగులు అండగా నిలిచారు. గురువారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్పీ వకుల్ జిందాల్ చేతుల మీదుగా రూ.3.60 లక్షలను మృతుడి కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ మృతుడి కుటుంబానికి ప్రభుత్వం నుంచి రావల్సిన బెనిఫిట్స్, కుటుంబంలో ఒకరికి ఉద్యోగం సకాలంలో కల్పించే చర్యలు చేపడతామన్నారు. కార్యక్రమంలో ఏఆర్ ఏఎస్పీ నాగేశ్వరరావు, ఆర్ఐ గోపాలనాయుడు, రవేశ్‌కుమార్, పి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో బీటెక్ విద్యార్థి మృతి

● నలుగురికి తీవ్ర గాయాలు ● ఇద్దరి పరిస్థితి విషమం



ప్రమాద స్థలంలో నుజ్జయిన కారు

జంగారెడ్డిగూడెం, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): ఏలూరు జిల్లా జంగారెడ్డిగూడెం మండలం తాడువాయి వద్ద జాతీయ రహదారిపై గురువారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో టి.నరసాపురం మండలం మెట్టగూడెం గ్రామానికి చెందిన కోమటి స్వామి (20) ఘటనా స్థలంలోనే మృతి చెందగా మరో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. వారి పరిస్థితి విషమంగా ఉంది. భద్రాచలం శ్రీరాముడిని దర్శించుకోవడానికి కారులో బయలుదేరిన ఎనిమిది మంది ఇంజనీరింగ్ విద్యార్థులు గురువారం ప్రమాదానికి గురయ్యారు. కొయ్యలగూడెం మండలం అంకాలగూడెంకు చెందిన కోమటికుంట ప్రమోద్, కొయ్యలగూడెంలోని కొత్తూరుకి చెందిన చింతా రాహుల్ కృష్ణ, విజయనగరం జిల్లా వీరసాగరం గ్రామానికి చెందిన జి.హేమంత్, కొయ్యలగూడేనికి చెందిన బెల్లాన అజయ్, బుట్టాయగూడేనికి చెందిన గరికపాటి హరిహరణ్, జంగారెడ్డిగూడెం మండలం వేగవరం గ్రామానికి చెందిన చిన్నం శ్రీనివాస్, శ్రీకాకుళం జిల్లా పాలంగికి చెందిన దుంగా నరేష్, టి.నరసాపురం మండలం మెట్టగూడేనికి చెందిన కోమటి స్వామి (20) తాడేపల్లిగూడెం శశి ఇంజనీరింగ్ కళాశాలలో బీటెక్ చదువుతున్నారు. తమ స్నేహితుడు దుంగా నరేష్ పుట్టినరోజు సందర్భంగా భద్రాచలం శ్రీరాముడిని దర్శించుకుని అక్కడ వేడుకలు చేసుకుందామని అనుకున్నారు. గురువారం ఉదయం తాడేపల్లిగూడెంలో మారుతి స్విఫ్ట్ కారును అద్దెకు తీసుకున్నారు. అక్కడి నుంచి ఏడుగురు విద్యార్థులు ఒకే కారులో బయలుదేరారు. వారిలో ఒకడైన బి.అజయ్ కారు డ్రైవ్ చేస్తున్నాడు. కొయ్యలగూడెంలో వారి స్నేహితుడైన కోమటి కుంట ప్రమోద్‌ను ఎక్కించుకున్నారు. ముందు సీటులో డ్రైవింగ్ చేస్తున్న అజయ్‌తో పాటు ఇద్దరు, వెనుక సీటులో ఐదుగురు కూర్చున్నారు. తాడువాయి జాతీయ రహదారి వద్దకు చేరుకునే సరికి కారు ప్రమాదవశాత్తు రోడ్డు మార్జిన్ దిగిపోయింది. ఈ క్రమంలో కారును రోడ్డు ఎక్కిస్తుండగా ఎదురుగా వస్తున్న లారీని ఢీకొట్టింది. ఈ ఘటనలో కారు రివర్స్‌లో తిరుగగా వెనుక భాగంలో లారీ కారును అతి బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కారు వెనుక భాగం నుజ్జునుజ్జయ్యింది. వెనుక సీటులో కూర్చున్న కోమటిస్వామి తలకు గాయాలవవడంతో తీవ్ర రక్తస్రావంతో అక్కడికక్కడే మృతి చెందాడు. జె.హేమంత్, రాహుల్ పరిస్థితి విషమంగా ఉంది. మరో ఇద్దరు ప్రమోద్, హరిహరణ్‌లు కూడా గాయపడ్డారు. 108 అంబులెన్సులో జంగా రెడ్డిగూడెం ఏరియా ఆసుపత్రికి తీసుకురాగా చికిత్స అందించారు. మెరుగైన చికిత్స కోసం రాహుల్, హేమంత్‌లను వారి బంధువులు స్థానిక ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి హేమంత్‌ను ఏలూరు ఆశ్రం ఆసుపత్రికి తరలించారు. అజయ్, నరేష్‌లు స్వల్పగాయాలతో బయటపడ్డారు సీఐ కృష్ణబాబు, ఎస్ఐ జబీర్ ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు.పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఉద్యోగం భరోసా ఇస్తే.. విధులకు హాజరవుతాం

● జేఎస్ఎల్ యాజమాన్యానికి స్పష్టం చేసిన కార్మికులు



యాజమాన్య ప్రతినిధితో చర్చలు జరుపుతున్న కార్మిక సంఘాల నాయకులు

కొత్తవలస, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగం భరోసా కల్పిస్తే విధులకు హాజరవుతామని జేఎస్ఎల్ కర్మాగారానికి చెందిన కార్మికులు స్పష్టం చేశారు. మండలంలోని అప్పన్నపాలెం పంచాయతీ జిందాల్ నగర్‌లోని జేఎస్ఎల్ కర్మాగారంలోని కార్మికులు బుధవారం నుంచి విధులను బహిష్కరించడంతో అక్కడ ఉత్పత్తి నిలిచిపోయిన విషయం తెలిసిందే. గురువారం టీఎన్‌టీయూసీ, సీఐటీయూ, వైసీపీ ట్రేడ్ యూనియన్ నాయకులు.. యాజమాన్య ప్రతినిధి గోపాలకృష్ణతో చర్చలు నిర్వహించారు. ప్రస్తుతం ఐదు రోజులకు సరిపడే ముడిసరుకు మాత్రమే ఉందని తరువాత పరిస్థితి ఏంటని ప్రశ్నించారు. తాము విధుల్లోకి రావాలంటే కర్మాగారాన్ని ఆపకుండా ఉత్పత్తి చేస్తామని రాత పూర్వకంగా హామీ ఇవ్వాలని కార్మిక సంఘాలు డిమాండ్ చేశాయి. గత అనుభవాలను దృష్టిలో ఉంచుకుని ఇలా కోరుతున్నామని యాజమాన్యానికి తెలిపారు. ఈ విషయాన్ని టాప్ మేనేజ్‌మెంట్‌కు తెలియజేస్తామని యాజమాన్య ప్రతినిధి గోపాలకృష్ణ తెలిపారు. ప్రస్తుతం కర్మాగారంలో వారం రోజులకు సరిపడే ముడిసరుకు ఉందని, కొత్తగా ముడిసరుకు రప్పించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. కార్మికులు సహకరించాలని కోరారు. చర్చల్లో మూడు కార్మిక సంఘాలకు చెందిన నాయకులు తమ్మినేని సూర్యనారాయణ, గాడి అప్పారావు, సింగంపల్లి గణేశ్, వామాలు తదితరులున్నారు.

కుటుంబ కలహాలతో మహిళ ఆత్మహత్య



వెంకయ్యమ్మ (ఫైల్)

భోగాపురం, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రావాడ పంచాయతీ గొల్లపేటకు చెందిన ఇప్పిలి వెంకయ్యమ్మ(39) గురువారం ఆత్మహత్యకు పాల్పడింది. స్థానికులు, పోలీసులు అందించిన వివరాల మేరకు.. మండలంలోని రాజాపులోవకు చెందిన ఇప్పిలి వెంకయ్యమ్మకు, రావాడ గొల్లపేటకు చెందిన ఇప్పిలి రమణకు 2006లో వివాహమైంది. భార్యాభర్తలు అన్యోన్యంగా ఉండేవారు. వీరికి ముగ్గురు పిల్లలున్నారు. రమణ ఆటో నడుపుతూ కుటుంబాన్ని పోషించేవాడు. అయితే కొన్నాళ్ల కిందట ఆటోను అమ్మేశాడు. మద్యానికి బానిసయ్యాడు. దాంతో భార్యాభర్తల మధ్య గొడవలు జరిగేవి. ఈ క్రమంలో కొంత భూమి అమ్మేస్తానని పలువురి దగ్గర డబ్బులు తీసుకుని రమణ జల్సా చేస్తున్నాడు. ఆర్థిక ఇబ్బందులు మొదలు కావడంతో వెంకయ్యమ్మ భవన నిర్మాణ పనులకు వెళ్తోంది. తల్లికి పెద్ద కుమారుడు మాధవ్ చేదోడుగా ఉంటున్నాడు. అయితే కుటుంబ కలహాలు పెరుగుతుండటంతో వెంకయ్యమ్మ మనస్తాపానికి గురైంది. గురువారం ఉదయం ఇంట్లో ఫ్యానుకు చీరతో ఉరి వేసుకుంది. సమాచారం అందుకున్న సీఐ ఎస్వీ ప్రభాకర్, ఎస్ఐలు వి.పాపారావు, పిసూర్యకుమారి ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతురాలి అన్నదమ్ములు చందక అప్పలనాయుడు, రామయ్య, సత్యనారాయణ.. కుటుంబ సభ్యులే చంపేశారని అనుమానం వ్యక్తం చేయడంతో క్లూస్ టీంను రప్పించారు. మృతురాలి భర్త రమణ, బావ నరసింహ వేధింపులు తాళలేక కుమార్తె ఆత్మహత్య చేసుకుందని తల్లి చందక పైడమ్మ ఆరోపించింది. పైడమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్ఐ సూర్యకుమారి తెలిపారు.

ట్రాక్టర్ బోల్తా: వ్యక్తి మృతి

పాచిపెంట, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గురువునాయుడు పేట నందేశ్వరాలయ సమీపంలో బుధవారం రాత్రి ట్రాక్టరు బోల్తా పడడంతో మాతుమూరుకు చెందిన మరిపెట్ల ఈశ్వరరావు (47) మృతి చెందాడు. పోలీసులు, స్థానికుల కథనం మేరకు.. ఈశ్వరరావు ట్రాక్టరు రిపేరు కోసం బొబ్బిలి వెళ్లాడు. రిపేరు చేయించుకుని తిరిగి ఇంటికి వస్తుండగా గురువునాయుడుపేట వద్ద అదుపు తప్పి బోల్తా పడింది. దీంతో ఈశ్వరరావు తలకు తీవ్రమైన గాయం కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. భార్య సింహాచలం ఫిర్యాదు మేరకు స్థానిక హెచ్‌సీ కృపారావు కేసు నమోదు చేశారు. ఈశ్వరరావు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సాలూరు సీహెచ్‌సీకి తరలించారు. ఈశ్వరరావుకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. కుమార్తె కవితకు వివాహం జరిగింది.

అత్యాచారం కేసులో వ్యక్తికి పదేళ్ల జైలు

బెలగాం, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): అత్యాచార కేసులో బలగ శివకు పదేళ్ల జైలు, రూ.ఐదు వేల జరిమానా విధిస్తూ గురువారం విజయనగరం మహిళా కోర్టు ప్రత్యేక న్యాయాధికారి ఎన్.పద్మావతి తీర్పు వెలువరించారని ఎస్పీ మాధవరెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. గరుగుబిల్లి పోలీస్‌స్టేషన్‌లో 2020లో ఓ బాధితురాలు ఫిర్యాదు మేరకు కేసు నమోదైందన్నారు. శివ నేరం రుజువు కావడంతో జైలు శిక్ష, జరిమానా విధించారని ఎస్పీ పేర్కొన్నారు.

చెట్టును ఢీకొన్న కారు

● ఇద్దరు ఉపాధ్యాయులకు గాయాలు

జామి, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కుమారాం జడ్పీ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు గురువారం ప్రమాదానికి గురయ్యారు. కారు అదుపు తప్పి చెట్టును ఢీకొన్న ఘటనలో ఇద్దరు ఉపాధ్యాయులు గాయపడ్డారు. మరో ఇద్దరు క్షేమంగా బయటపడ్డారు. ఇందుకు సంబంధించిన వివరాల్లోకి వెళితే.. ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలను చేర్పించాలని అట్టాడలో ఇంటింటా ప్రచారం చేసేందుకు నలుగురు ఉపాధ్యాయులు కారులో గురువారం బయలుదేరారు. వారురు ప్రయాణిస్తున్న కారు అట్టాడ సమీపంలో అదుపు తప్పి తాటిచెట్టును ఢీ కొంది. దాంతో వెనుక సీటులో కూర్చున్న గుండాల శ్రీనివాస్, నేతాజీ గాయపడ్డారు. ప్రమాద సమయంలో కారులోని ఎయిర్ బెలూన్లు తెరచుకోవడంతో ముందు సీటులో ఉన్న రమణ, ఈశ్వరరావు క్షేమంగా బయటపడ్డారు. గాయపడిన శ్రీనివాస్, నేతాజీలను విజయనగరంలోని ప్రైవేట్ ఆసుపత్రిలో చేర్చారు.

డాక్టర్‌కు తీవ్ర గాయాలు

మక్కువ, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని శంబర ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి చెందిన డాక్టర్ మామిడి సాహితి గురువారం తీవ్ర గాయాలపాలయ్యారు. ఆమె నడుపుతున్న స్కూటీ అదుపు తప్పడమే అందుకు కారణం. ఎర్రసామంతవలస ఏర్పాటు చేసిన వైద్య శిబిరంలో ఆమె పాల్గొని తిరిగి వస్తుండగా వెలగడవలస వద్ద స్కూటీ అదుపు తప్పింది. దాంతో ఆమెకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు ఆమెను మక్కువ పీహెచ్‌సీకి తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం అక్కడ వైద్యాధికారి హరికృష్ణ మెరుగైన చికిత్స కోసం విజయనగరంలోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు.

1,800 లీటర్ల బెల్లపు ఊట ధ్వంసం

జియ్యమ్మవలస, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చినమేరంగిలో గురువారం జిల్లా టాస్క్‌ఫోర్స్ ఆధ్వర్యంలో సారా స్థావరాలపై దాడులు నిర్వహించారు. 1,800 లీటర్ల పులిసిన బెల్లపు ఊటను ధ్వంసం చేశారు. 40 లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నారు. సారా తయారీకి ఉపయోగించే బెల్లం ఊట లభ్యం కావడంతో నలుగురిపై కేసు నమోదు చేసినట్టు టాస్క్‌ఫోర్స్ సీఐ వీవీఎస్ శేఖర్‌బాబు, కురుపాం ఎక్సైజ్ సీఐ పి.శ్రీనివాసరావు తెలిపారు. సారా తయారీకి ముడిసరుకు సప్లై చేస్తున్న గెంబలి తిరుమలరావు, సూరు శ్రీధర్‌లపై కేసు నమోదు చేశారు. కార్యక్రమంలో ఎస్ఐలు రాజశేఖర్, చంద్రకాంత్‌లతో పాటు జిల్లా టాస్క్‌ఫోర్స్ సిబ్బంది, కురుపాం ఎక్సైజ్ సిబ్బంది పాల్గొన్నారన్నారు.

కొత్తగూడలో వెయ్యి లీటర్లు..

● భామిని: మండలంలోని కొత్తగూడ పరిసరాల్లో 40 లీటర్ల సారా తరలిస్తున్న బి.కొండరావును అదుపులోకి తీసుకున్నట్లు ఏఈఎస్ ఏఎస్ దొర తెలిపారు. గురువారం పాలకొండ, కొత్తూరు ఎక్సైజ్ సిబ్బందిదాడులు నిర్వహించారు. వెయ్యి లీటర్ల బెల్లపు ఊట గుర్తించి దాన్ని ధ్వంసం చేశామని ఏఈఎస్ చెప్పారు. సారా తయారీకి బెల్లం సప్లై చేసిన ఘణసర గ్రామానికి చెందిన భూపతి షణ్ముఖపై కేసు నమోదు చేశామన్నారు. దాడుల్లో పాలకొండ, కొత్తూరు ఎక్సైజ్ సీఐలు సూర్యకుమారి, కిరణ్మయి, మొబైల్ పార్టీ సీఐ మురళి, ఈఎస్‌టీఎఫ్ శ్రీకాకుళం సీఐ పి.లీలారాణి, ఎస్ఐ తిరుపతిరావు సిబ్బంది పాల్గొన్నారు.

వీజీకే మూర్తికి నివాళి



చిత్రపటం ఎదుట దళిత నాయకుల నివాళి

రాజాం రూరల్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): స్థానిక బీఎస్పీ కార్యాలయంలో గురువారం వీజీకే మూర్తి వర్ధంతి సభను నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సామాజిక, న్యాయపోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు కల్లేపల్లి రాంగోపాల్ హాజరై.. మూర్తి చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బడుగు, బలహీనవర్గాల కోసం మూర్తి అహర్నిశలు శ్రమించారన్నారు. కార్మికవర్గానికి జీవితాన్ని అంకితం చేశారని కొనియాడారు. అంబేడ్కర్ సూర్యుడు పుస్తకాన్ని రాశారని గుర్తుచేశారు. కార్యక్రమంలో బీఎస్పీ నియోజకవర్గ అధ్యక్షుడు బొత్స బుద్ధుడు, దళిత ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు సాకేటి నాగరాజు, విశ్రాంత తహసీల్దార్ రామప్పుడు, రవికుమార్, తవిటయ్య, తేగల మోహన్, శివ, శంకరరావు పాల్గొన్నారు.

ఇళ్ల క్రమబద్ధీకరణకు దరఖాస్తుల ఆహ్వానం

లక్కవరపుకోట, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ భూముల్లో ఇళ్ల నిర్మాణాలు చేపట్టిన పేదలకు వాటిని క్రమబద్ధీకరణ చేసుకునే అవకాశం ప్రభుత్వం కల్పించిందని తహసీల్దార్ ప్రసాదరావు తెలిపారు. జీవో నెంబరు 30ని అనుసరించి 15 అక్టోబరు 2019 నాటికి ఇళ్ల నిర్మాణం చేపట్టిన వారు ఇందుకు అర్హులని వివరించారు. డిసెంబరు 31లోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. నిబంధనలను అనుసరించి దరఖాస్తు చేసుకోవాలన్నారు. పూర్తి సమాచారం కోసం తహసీల్దార్ కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

సిబ్బంది లేక.. సమస్యలు పరిష్కారం కాక

● ఇదీ జియ్యమ్మవలస తహసీల్దార్ కార్యాలయం పరిధిలో పరిస్థితి



తహసీల్దార్ కార్యాలయం వద్ద ప్రహరీ లేని దృశ్యం

జియ్యమ్మవలస, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): జియ్యమ్మవలస తహసీల్దార్ కార్యాలయంలో సమస్యలు తిష్ఠ వేశాయి.ప్రధానంగా ఇక్కడ వసతులతోపాటు సిబ్బంది సరిపడలేరు. దీంతో కార్యాలయానికి పనులపై వచ్చే అర్జీదారులు అగచాట్లకు గురవుతున్నారు. పూర్తి స్థాయిలో సిబ్బంది లేకపోవడంతో రెవెన్యూ పరమైన సమస్యలు పరిష్కారానికి నోచుకోవడం లేదని పలువురు వాపోతున్నారు.

జియ్యమ్మవలస తహసీల్దార్ కార్యాలయం పరిధిలో 25 రెవెన్యూ క్లసర్లు, వాటి పరిధిలో 58 రెవెన్యూ గ్రామాలు ఉన్నాయి. అయితే ప్రస్తుతం సివిల్ సప్లయిస్ డిప్యూటీ తహసీల్దార్ (సీఎస్‌డీటీ) పోస్టు ఏడాదిగా ఖాళీగానే ఉంది. దీంతో రేషన్ దుకాణా నిర్వహణ గాడితప్పుతోంది. ఈనేపథ్యంలో తమ సమస్యలను డీలర్లు, ఎండీయూ ఆపరేటర్లు తహసీల్దార్ దృష్టికి తీసుకువెళ్లాల్సివస్తోంది. ప్రస్తుతం ఇక్కడ పూర్తిస్థాయిలో తహసీల్దార్ లేకపోవడంతో స్థానిక డీటీ రెడ్డి పకీరుకు ఫుల్ అడిషనల్ చార్జెస్ (ఎఫ్ఏసీ)గా బాధ్యతలు అప్పగించారు.అలాగే రీసర్వే డిప్యూటీ తహసీల్దార్‌గా ఉన్న శివజగన్మోహనరావును డిప్యూటేషన్‌తో జిల్లా కలెక్టరేట్‌కు పంపించడంతో ఆ పోస్టు ఖాళీగానే ఉంది. ప్రస్తుతం గ్రామాల్లో రీసర్వే జరుగుతున్న నేపథ్యంలో రీసర్వేడీటీ పర్యవేక్షణలేకుండా చేయాల్సివస్తోంది.ఓఆర్ఐ డిప్యూటేషన్ ప్రాతిపదికన పనిచేస్తున్నారు.

రన్నింగ్ వాటర్ లేక..

తహసీల్దార్ కార్యాలయంలో సిబ్బంది కొరతతోడు వసతులు కూడా వేధిస్తున్నాయి. కార్యాలయంలో లక్షలాదిరూపాయలతో నిర్మించిన మరుగుదొడ్లకు రన్నింగ్ వాటర్ సదుపాయం లేదు. దీంతో అవి నిరుపయోగంగా ఉన్నాయి. అత్యవసర సమయాల్లో ఆరుబయటకు వెళ్లాల్సి వస్తోంది. ప్రతి వివిధ పనులపై సుమారు 50 నుంచి వంద మంది వరకూ వస్తుంటారు. వారంతా కూడాఅగచాట్లకు గురవుతున్నారు.తహసీల్దార్ కార్యాలయం చుట్టూ ప్రహరీ లేకపోవడంతో ప్రాంగణం బహిర్భూమిగా స్థానికులు వినియోగిస్తుండడంతో దుర్వాసనతో ఉద్యోగులు, అర్జీదారులు ఇబ్బందిపడుతున్నారు. తక్షణమే కలెక్టర్ తహసీల్దార్ కార్యాలయంలో పూర్తిస్థాయిలో సిబ్బందిని నియమించడంతోపాటు వసతులు కల్పించాలని పలువురు కోరుతున్నారు.

పండగలోపు పనులు పూర్తయ్యేనా?

(5వ పేజీ తరువాయి)

కారణంగా ఇంకా పనులు ప్రారంభం కాలేదనే విమర్శలు వినిపిస్తున్నాయి.

గత ఐదేళ్లూ నిర్లక్ష్యం..

గత వైసీపీ ప్రభుత్వం సాలూరు పట్టణ అభివృద్ధిని పట్టించుకోలేదు. ఐదేళ్ల పాలనలో పట్టణ రోడ్ల అభివృద్ధికి రూపాయి కూడా ఇవ్వలేదు. కనీసం గుంతలు కూడా పూడ్చలేదు. కాలువల్లో పూడికలు తీసిన దాఖలాలు లేవు. అయితే, కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత తారు, సీసీ రోడ్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. మునిసిపాల్టీ రోడ్లపై ఉన్న గుంతలను పూడ్చింది. పూడికలతో నిండిపోయిన కాలువలను శుభ్రం చేస్తున్నారు. ప్రజలకు ఎలాంటి విద్యుత్ ఇబ్బందులు తలెత్తకుండా పట్టణంలో 12 హెవీ కెపాసిటీ ఉన్న ట్రాన్స్‌ఫార్మర్లను బిగిస్తున్నారు. సుమారు 52 విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేస్తున్నారు.

త్వరలో పనులు ప్రారంభిస్తాం

మునిసిపాల్టీలో బీటీ రోడ్ల నిర్మాణానికి నిధులు కేటాయించి ప్రతిపాదనలు చేశాం. పాలకవర్గం ఆమోదం కూడా పొందాయి. టెండర్లు పిలవాలి. ఖరారైన వెంటనే పనులు ప్రారంభిస్తాం. ఒకటి రెండు రోజుల్లో కొత్త కమిషనర్ వచ్చి విధుల్లో చేరుతారు.

-బీవీ ప్రసాద్, ఇన్‌చార్జి కమిషనర్, సాలూరు మునిసిపాల్టీ

ప్రాజెక్టులు ఇక్కడ.. సర్కిల్ ఆఫీసు అక్కడ

(5వ పేజీ తరువాయి)

సాగిస్తుంటారు. వీరికి పార్వతీపురం కంటే బొబ్బిలి తక్కువ దూరంలో ఉంటుంది. వారి సౌలభ్యం కోసమే బొబ్బిలిలోనే సర్కిల్ కార్యాలయాన్ని కొనసాగిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. పార్వతీపురంలో ఇరిగేషన్ సర్కిల్ కార్యాలయాన్ని ఏర్పాటు చేయాలని గత వైసీపీ ప్రభుత్వంలో పలుమార్లు రైతులు విన్నవించినా ఫలితం శూన్యం. కూటమి ప్రభుత్వమైనా స్పందించి మన్యం జిల్లాలో ఇరిగేషన్ సర్కిల్ కార్యాలయాన్ని ఏర్పాటు చేయాలని రైతులు కోరుతున్నారు.

పడకేసిన ప్రాజెక్టులు..

వైసీపీ ప్రభుత్వ పాలనలో ఇరిగేషన్ శాఖ పూర్తిగా గాడితప్పింది. సాగునీటి ప్రాజెక్టుల వద్ద పెండింగ్ పనులు చేయడానికి నిధులు కేటాయించకపోవడంతో పనులు పడకేశాయి. జపాన్ నుంచి అప్పు తెచ్చుకున్న నిధులను కూడా జగన్ సర్కారు తన అవసరాల కోసం వినియోగించుకుంది. ఫలితంగా వైసీపీ ఐదేళ్ల పాలనలో వెంగళరాయ సాగర్, పెదంకలాం, వట్టిగెడ్డ ప్రాజెక్టులు అభివృద్ధికి నోచుకోలేదు. ఎన్ఆర్‌ఈజీఎస్ ద్వారా మంజూరైన మెటీరియల్‌కాంపోనెంట్ నిధులతో పనులు చేపడితే కొంతవరకైనా ప్రాజెక్టులు అభివృద్ధి చెందే అవకాశం ఉంది. కూటమి ప్రభుత్వంలో సాగునీటి ప్రాజెక్టులు బాగుపడతాయని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

ఎస్సీ వర్గీకరణతో ఉపకులాలకు మేలు

● పార్వతీపురం ఎమ్మెల్యే విజయచంద్ర


బెలగాం: మాట్లాడుతున్న ఎమ్మెల్యే విజయచంద్ర

బెలగాం, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి) : ఎస్సీ వర్గీకరణతో ఉపకులాలకు మేలు జరుగుతుందని పార్వతీపురం ఎమ్మెల్యే విజయచంద్ర తెలిపారు. గురువారం పార్వతీపురంలో విలేకరులతో మాట్లాడుతూ షెడ్యూల్ కులాలకు విద్య, ఉద్యోగాల్లో సమాన అవకాశాలు కల్పించడమే లక్ష్యంగా ఎస్సీ వర్గీకరణ రాష్ట్ర ప్రభుత్వం చేస్తోందని తెలిపారు. దశాబ్దాల కలగా ఉన్న ఎస్సీ వర్గీకరణ సాకారం చేసిన సీఎం చంద్రబాబు నాయుడుకు రుణపడి ఉంటామన్నారు. గతంలో చంద్రబాబు నాయుడు సీఎంగా ఉన్న సమయంలో ఎస్సీ వర్గీకరణకు ఆమోదించారని, ప్రస్తుతం చట్టబద్ధత కల్పించడం ఎస్సీలపై ఆయనకు ఉన్న చిత్తశుద్ధి నిదర్శమని తెలిపారు.విద్య, ఉద్యోగాలు ఇప్పటివరకు పొందని ఉపకులాలకు సమానఅవకాశాలు లభిస్తాయని చెప్పారు.ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు అన్ని వర్గాలకు సమన్యాయం చేయడంతోపాటు జబాబుదారీ ప్రభుత్వం పని చేస్తోందని తెలిపారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు దివ్య, ఆనందరావు, నాయకులు శ్రీదేవి, రాజశేఖర్ పాల్గొన్నారు.

అమ్మవార్ల పండగను విజయవంతగా నిర్వహించండి

పార్వతీపురం, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి) : పార్వతీపురంలోని ఇప్పల పోలమ్మ, ఎర్రకంచమ్మ అమ్మవార్ల పండగను విజయవంతంగా నిర్వహించాలని ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర సూచించారు.గురువారం ఉత్సవ కమిటీ సభ్యులు ఎమ్మెల్యేకు ఆహ్వాన పత్రికను అందజేశారు.

అంచనాల కమిటీ సమావేశంలో జయకృష్ణ


సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే జయకృష్ణ

పార్వతీపురం/పాలకొండ, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి) : శాసనసభ అంచనాల కమిటీ సమావేశం తిరుపతిలో గురువారం నిర్వహించారు. ఈ సమావేశంలో పాలకొండ ఎమ్మెల్యే, అంచనాల కమిటీ సభ్యుడు నిమ్మక జయకృష్ణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలు అంశాలపై చర్చించినట్లు చెప్పారు.

ఎస్‌హెచ్‌జీల బలోపేతానికి చర్యలు

●జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ సుధారాణి

గరుగుబిల్లి, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): ఎస్‌హెచ్‌జీలు బలోపేతమయ్యేందుకు అవసరమైన చర్యలు చేపడుతున్నామని జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ సుధారాణి తెలిపారు. గురువారం గరుగుబిల్లిలోని వెలుగు కార్యాలయంలో మండల సమాఖ్య సమావేశం నిర్వహించారు.ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ గత ఏడాది మన్యం జిల్లా పరిధిలోని పలు మండల సమాఖ్యలు ప్రగతి పథంలో నిలిచాయన్నారు. గరుగుబిల్లికి సంబంధించి సీఐఎఫ్, స్త్రీనిధి, ఉన్నతి పథకాల్లో ప్రగతి సాధించడంపై అభినందించారు. ఈఆర్థిక సంవత్సరంలో నిర్దేశించిన లక్ష్యాలను చేరుకోవాలన్నారు. బ్యాంకుల నుంచి తీసుకున్న రుణాలను సద్వినియోగం చేసుకుని సకాలంలో చెల్లించాలని కోరారు.గ్రామాల్లో జీవనోపాదులు కల్పనకు అవసరమైన ప్రణాళికలు తయారు చేస్తున్నామన్నారు. దీనిలో భాగంగా మండలాల్లో ప్రత్యేక సర్వేను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రెండో రోజుల్లో ఏసీఎల్‌పీ సర్వేను పూర్తి చేయాలన్నారు. మండల సమాఖ్యల పరిధిలో తప్పిదాలకు ఆస్కారం లేకుండా వ్యవహరించాలన్నారు. సిబ్బంది పనితీరుపై ఫిర్యాదులు వస్తే సహించేది లేదన్నారు.సమావేశంలో బ్యాంకు యాంకర్ పర్సన్ సింహాచలం, ఎఫ్‌ఈవోల ఏపీఎం కె.భారతి,, స్త్రీనిధి ఏజీఎం హేమలత, ఏపీఎం పి.అప్పలనాయుడు, వెలుగు సీసీలు సీహెచ్ తిరుపతిరావు, బి.రామినాయుడు పాల్గొన్నారు.

ఎఫ్‌ఏలకు కనీస వేతనం ఇవ్వాలి

బెలగాం, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్ల(ఎఫ్ఎ)కు కనీస వేతనం ఇవ్వాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, ఉపాధి కూలీలకు వేతనాలు చెల్లించాలని సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. గురువారం పార్వతీపురం లోని ఆర్టీసీ కాంప్లెక్స్ నుంచి కలెక్టరేట్ వరకు సీఐటీయూ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం కలెక్టరేట్ వద్ద ఎఫ్ఎల సమస్యలు పరిష్కరించాలని ఆందోళన చేపట్టి, కలెక్టర్ శ్యాంప్రసాద్, డ్వామా పీడీ రామచంద్రరావుకు వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా సీఐటీయూ నాయకులు మాట్లాడుతూ ఎఫ్ఎలపై రాజకీయ వేధింపులు ఆపాలని, మేట్లకు పారితోషకం చెల్లించాలని డిమాండ్ చేశారు కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు కొల్లి గంగునాయుడు, రమణారావు, మన్మథరావు, బీవీ రమణ, ఇందిర, ఫీల్డ్ అసిస్టెంట్లు హరినాధ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులను చేర్పించండి

వీరఘట్టం,ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి):కంబర, గడగమ్మ, మూలలంక ప్రాథమిక పాఠశాలల హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులను చేర్పించాలని తల్లిదండ్రులకు గురువారం అవగాహన కల్పించారు. ఆయా గ్రామాల్లో ర్యాలీలు నిర్వహించి, ప్రభుత్వ పాఠశాలల ఆవశ్యకతను వివరించారు.ఈ సందర్భంగా యూటీఎఫ్ నాయకుడు ఎం.ఫైడిరాజు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పిస్తే ఉచితంగా పుస్తకాలు, యూనిఫాం, మధ్యాహ్నం భోజనం వంటి పలు సదుపాయాలు లభిస్తాయని వివరించారు కార్య క్రమంలో ఉపాధ్యాయులు కురమాన గోవిందరావు, దుర్గాప్రసాద్, ముకుందరావు,సింహాచలం పాల్గొన్నారు.

నవధాన్యాల సాగుతో ప్రయోజనం

బలిజిపేట, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): ప్రకృతి వ్యవసాయంలో నవ ధాన్యాల సాగుతో రైతుకు, పర్యావరణానికి ఎంతో ప్రయోజనం కలుగుతుందని ఏవో ఎం.శ్రావణ్ కుమార్ తెలిపారు. గురువారం మండలంలోని వెంగళరాయపురంలో వ్యవసాయం వెలుగు, ప్రకృతి వ్యవసాయ శాఖల గ్రామస్థాయి సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నవధాన్యాల సాగుపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో వీఏఏ, వీఏఏలు, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

సమస్యలను పరిష్కరించండి

● ఎన్ఎంయూ పార్వతీపురం డిపో కార్యదర్శి కేబీరాజు


ఆర్టీసీ డిపో గేటు వద్ద నిరసన తెలుపుతున్న ఎన్ఎంయూ నాయకులు

పార్వతీపురంటౌన్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): కార్మికులకు సంబంధించి దీర్ఘకాల సమస్యలను పరిష్కరించాలని ఎన్ఎంయూ పార్వతీపురం డిపో కార్యదర్శి కేబీరాజు, ఉపాధ్యక్షుడు బోగేష్‌లు డిమాండ్‌చేశారు. గురువారం పార్వతీపురంలోని ఆర్టీసీడిపో గేటు వద్ద కార్మికుల దీర్ఘకాలిక సమస్యలు పరిష్కరించాలని నిరసన తెలిపారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ కార్మికుల హక్కులను పరిరక్షించాల్సిన యాజమాన్యంవారిపై నిరంకుశ వైఖరి అవలంబిస్తోందని ఆరోపించారు. డ్రైవర్లు, సిబ్బందికి ప్రభుత్వం నుంచి రావాల్సిన రాయితీలతోపాటుసదుపాయాలను యాజమాన్యం నిలుపుదల చేయడం సరైన పద్ధతికాదని తెలిపారు. ఎలక్ట్రికల్ బస్సులు ప్రభుత్వం, సంస్థ ద్వారా నడపాలని కోరారు. మహిళా కండకర్లకు విధి నిర్వహణలో ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని, తీవ్రమైన అనారోగ్యంతో బాధపడుతున్న ఉద్యోగులకు ఓడీలను కేటాయించాలని డిమాండ్‌చేశారు.

తాగునీటి సమస్యపై చర్యలు : డీఎల్‌పీవో

కురుపాం, ఏప్రిల్17(ఆంధ్రజ్యోతి):గ్రామాల్లో తాగునీటి సమస్యపై పంచాయతీ కార్యదర్శులు చర్యలు తీసుకోవాలని డీఎల్‌పీవో జె.రాంప్రసాదరావు ఆదేశించారు. గురువారం కురుపాంలో ఎంపీడీవో జె.ఉమామహేశ్వరి అధ్యక్షతన వేసవిలో తాగునీటి ఎద్దడి లేకుండా ముందస్తుగా తీసుకోవలసిన చర్యలపై కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఏజెన్సీ గ్రామాల్లో అవసరమైతే ట్యాంకుల ద్వారా నీరు సరఫరా చేయాలని కోరారు. క్రాస్ ప్రోగ్రామ్ సక్రమంగా నిర్వహించాలని, తాగునీటి ట్యాంకుల్లో క్లోరినేషన్ చేయించాలని కోరారు.

అటవీ సిబ్బందిపై చర్యలు తీసుకోండి

● గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి శ్రీనివాసరావు

కురుపాం,ఏప్రిల్17(ఆంధ్రజ్యోతి):అటవీశాఖ సిబ్బందిపై ఉన్నతాధికారులు చర్యలుతీసుకోవాలని గిరిజనసంఘం జిల్లాకార్యదర్శి ఎం.శ్రీనివాసరావు కోరారు. తక్షణమే చర్యలు తీసుకోకపోతే గిరిజనులతో పెద్ద ఎత్తున అటవీ శాఖ కార్యాలయం ఎదుట ఆందోళన చేపడతామని హెచ్చరించారు. గురువారం కురుపాం వారపు సంతలో అటవీ అధికారలు తీరుకు నిరసిస్తు ధర్నా నిర్వహించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ గిరిజనులు అటవీ ఫలసాయం అమ్ముకుంటే సిబ్బంది అడ్డుకోవడం సరికాదని తెలిపారు. కురుపాం వారపు సంతకు గిరిజనులు వాహనాలతో చింతపండు తీసుకువస్తుంటే మధ్యలో అటవీశాఖ సిబ్బంది అడ్డుకొని అమ్మడానికి వీలులేదని గిరిజనులను హెచ్చరిస్తున్నారని చెప్పారు. పోడు వ్యవసాయం చేసుకొని అటవీ ఫలసాయం అమ్ముకొనే హక్కు గిరిజనులకు ఉందని చెప్పారు.

క్రికెట్ విజేత కురుపాం కింగ్స్


కురుపాం కింగ్స్ జట్టుకు ట్రోఫీ అందజేస్తున్న నిర్వాహకులు

కురుపాం,ఏప్రిల్17(ఆంధ్రజ్యోతి): కురుపాంలో జరిగిన నియోజకవర్గస్థాయి క్రికెట్ పోటీల్లో కురుపాం కింగ్స్ జట్టు గెలుపొంది ట్రోఫీని కైవసం చేసుకుంది. నెలరోజులుగా కురుపాంలో నియోజకవర్గస్థాయి క్రికెట్ పోటీలు నిర్వహిస్తున్నారు.ఈ మేరకు గురువారం జరిగిన ఫైనల్‌లో గుమ్మలక్ష్మీపురం మండలంలోని కొండవాడ జట్టుపై కురుపాం కింగ్స్ జట్టు విజయం సాధించింది. కురుపాం కింగ్స్ జట్టుకు 40 వేలతో పాటు ట్రోఫీ, రన్నర్స్‌గా నిలిచిన కొండవాడ జట్టుకు 20 వేల రూపాయలను టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వైరిచర్ల వీరేష్ చంద్రదేవ్ అందజేశారు. కార్యక్రమంలో జడ్పీటీసీ మాజీ సభ్యుడు అంధవరపు కోటేశ్వరరావు, క్రికెట్ టోర్నమెంట్ నిర్వాహకులు దొనక నవీన్, పెద్దింటి ఇమ్మానుమేలు పాల్గొన్నారు.

విద్యార్థులు ఆత్మహత్యలకు పాల్పడొద్దు

పాచిపెంట, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): పరీక్షల్లో తప్పినంత మాత్రాన విద్యార్థులు ఆత్మహత్యలకు పాల్పడొద్దని జిల్లా కెరీయర్, మెంటల్ హెల్త్ కౌన్సిలర్ బి.రమేష్ సూచించారు. గురువారం స్థానిక కేజీబీవీలో సమగ్ర శిక్ష అడిషనల్ ప్రాజెక్టు కోఆర్డినేటర్ ఆదేశాల మేరకు గర్ల్స్ చైల్డ్ డెవలప్‌మెంట్ ఆఫీసరు సమక్షంలో జి.మధుకిషోర్ సమక్షంలో పదో తరగతి విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో కెరీర్, మెంటల్ హెల్త్ కౌన్సిలర్లు జి.గౌరి పాల్గొన్నారు.

ఉపాధ్యాయులు అందుబాటులో ఉండాలి

రామభద్రపురం,ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): వేసవికాలంలో నిర్వహించే ప్రత్యేక విద్యా కార్యక్రమాలకు ఉపాధ్యాయులు అందుబాటులో ఉండాలని, వివరాలు ఎప్పటికప్పుడు అందించాలని డిప్యూటీ డీఈవో మోహనరావు తెలిపారు. రానున్న విద్యా సంవత్సరంలో ప్రభుత్వ పాఠ శాలల్లో విద్యార్థులనమోదుకు కృషి చేయాలని కోరారు. గురువారం స్థానిక జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ మండలంలో ఉన్న అన్ని ప్రభుత్వ పాఠశాలల నుంచి విద్యార్థులను నమోదు చేసుకోవడానికి ఇప్పటి నుంచే ప్రణాళికలు రూపొందించాలని సూచించారు. సమావేశంలో ఎంఈవోలు తిరుమల ప్రసాద్, పెంటయ్య పాల్గొన్నారు.

ఇళ్లు కోల్పోయిన వారికి పరిహారం: ఆర్డీవో

రామభద్రపురం, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): మండలంలోని తారాపురంలో ఎన్‌హెచ్-26 విస్తరణలో భాగంగా ఇళ్లు కోల్పోయిన వారికి నష్టాన్ని బట్టి ప్రభుత్వం పరిహారం చెల్లిస్తుందని ఆర్డీవో రామ్మోహనరావు తెలిపారు. తారాపురంలో ఇళ్లుకోల్పోతున్న వారు ఎంత మేరకు నష్టపోతున్నారు అన్న విషయంపై ఎన్‌హెచ్ అధికారులతో కలిసి గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విస్తరణలో ఎక్కువగా తొలగించకుండా ఎక్కువగా నష్టం జరగకుండా చర్యలు తీసుకోవాలని ఆర్అండ్‌బీ అధికారులకు సూచించారు. రహదారి విస్తరణకు సహకరించాలని, ఇళ్లు కోల్పోయిన వారికి ప్రభుత్వ నిబంధనల ప్రకారం పరిహారం అందుతుందని తెలిపారు. జీవో నెంబరు 23 ప్రకారం ఇంటి స్థలాకు దరఖాస్తు చేసుకుంటే అర్హులకు ప్రభుత్వంస్థలం మంజూరు చేస్తుందని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ సులోచనరాణి పాల్గొన్నారు.

రాయగడలో బిజూ పట్నాయక్‌కు నివాళి

రాయగడ, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): రాయగడలో ముఖ్యమంత్రి బిజూ పట్నాయక్ 28వ వర్థంతిని బిజు జనతాదళ్ కార్యాలయంలో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా బిజూ పట్నాయక్‌కు నివాళులర్పించి, ఆయన చేసిన సేవలను గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో రాజ్యసభ మాజీ సభ్యుడు నెక్కంటి భాస్కరరావు, లాల్ బిహారి హిమిరిక మహేష్‌పట్నాయక్, టున్నిహుయిక పాల్గొన్నారు.

వైద్యుల పోస్టుల భర్తీకి చర్యలు తీసుకోవాలి

రాయగడ, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి):జిల్లాలో ప్రాథమికసామాజిక ఆరోగ్య కేంద్రాల్లో వైద్యుల పోస్టుల భర్తీకి చర్యలు తీసుకోవాలని జిల్లా ముఖ్యవైద్యాధికారి ప్రఫుల్ల కుమార్ పాడి తెలిపారు. రాయగడలోని జడ్పీ సమావేశ హాలులో జిల్లా పరిషత్ అధ్యక్షురాలు సరస్వతి మాఝి అధ్యక్షతన 80 వ కౌన్సిల్ సమావేశం జరిగింది. కార్యక్రమంలో రాయగడ, గుణుపూర్, బిసంకటక్ శాసనసభ్యులు అప్పలస్వామి కద్రక, సత్యజిత్ గొమాంగ్, నీలమాధవ హిక్కాక, కలెక్టర్ పారుల్ పట్వారి, జిల్లాపరిషత్ కార్యనిర్వాహణాధికారి అక్షయ్‌కుమార్ ఖెముండు, ఐటీడీఏ పీఏ చంద్రకాంత్ మాఝి పాల్గొన్నారు.

పౌష్టికాహారంపై అవగాహన పెంపొందించాలి

సీతంపేట రూరల్,ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి):పౌష్టికాహారంపై అవగాహన పెంపొందించాలని సీడీపీవో రంగలక్ష్మి తెలిపారు.గురువారం జి.గుమ్మడ అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ పక్వాడ్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతు అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే గర్భిణులు, బాలింతలకు బల వర్ధకమైన పౌష్టికాహారం అందించాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ బి.ప్రధాన్ పాల్గొన్నారు.

●కొమరాడ, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా గర్భిణులకు సక్రమంగా పౌష్టికాహారం అందించాలని కొమరాడ పీహెచ్‌సీ వైద్యురాలు శిరీష కోరారు. కొమరాడలో అంగన్‌వాడీ కార్యకర్తలు నిర్వహించిన కార్య క్రమంలో మాట్లాడుతూ గర్భిణులపై అంగన్‌వాడీ కార్యకర్త ప్రత్యేక దృష్టిసారించాలనికోరారు. కార్యక్రమంలో ఎంఈవో నారాయణస్వామి, పీవో సుగుణకుమారి పాల్గొన్నారు.

●పాలకొండ, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి):మండలంలోని తంపటాపల్లిజడ్పీ పాఠశాలలో పోషణ పక్వాడ్ కార్యక్రమంలో భాగంగా కిషోర బాలికలకు బాల్యవివాహాలు, పరిశుభ్రత తదితర అంశాల పై గురువారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి వెన్నెల విద్యార్థినులకు గుడ్‌టచ్-బ్యాడ్‌టచ్, రుతుస్రావంతోపాటు పరిశుభ్రతపై వివరించారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు.

గృహ నిర్మాణాలు వేగవంతం చేయాలి

పాలకొండ, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి):గృహ నిర్మాణాలు వేగవంతం చేయాలని పాలకొండ నగర పంచాయతీ ప్రత్యేకాధికారి జి.చిన్నబాబు కోరారు. గురువారం పాలకొండ నగర పంచాయతీలో జరుగుతున్న హౌసింగ్ నిర్మాణాలను పరిశీలించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ హౌసింగ్ నిర్మాణాలకు సంబంధించి నిర్దేశిత లక్ష్యాలను అందుకోవాలని గృహ నిర్మాణ శాఖ ఏఈ, వార్డు సెక్రటరీలకు ఆదేశించారు. అనంతరం ఓనిగెడ్డ నీటి వాటర్ ట్యాంక్‌ను పరిశీలించారు.

పంచాయతీ కార్యదర్శిపై ఫిర్యాదు

గరుగుబిల్లి, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని శివ్వాం పంచాయతీ కార్యదర్శి బంటు అప్పారావు సరిగ్గా స్పందించడంలేదని తెలుగుదేశం పార్టీ ప్రతినిధులు బొంగు నారాయణస్వామి, పల్ల సింహాచలంనాయుడు తెలిపారు.ఈమేరకు గురువారం పార్వతీపురంలోని కార్యాలయంలో జిల్లా పంచాయతీ అధికారి కొండలరావులకు ఫిర్యాదుచేశారు.ఈమేరకు విచారణ చేపట్టనున్నట్లు డీపీవో తెలియజేశారని టీడీపీ ప్రతినిధులు తెలిపారు.

సాగుభూమికి పట్టాలివ్వాలి

బెలగాం, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): విజయనగరం జిల్లాలోని ఎస్.కోట మండలంలోగల బొడ్డపాడు గ్రామానికి చెందిన గిరిజనులు సాగుచేస్తున్న భూమికి పట్టాలు ఇవ్వాలని ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు డిమాండ్‌చేశారు. ఈ మేరకు పార్వతీపురంలోని ఐటీడీఏ కార్యాలయంలో ఏపీవో మురళికి గురువారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయా సంఘం నాయకులు మాట్లాడుతూ 30 ఏళ్లుగా గిరిజన కుటుంబాలు సాగు చేస్తున్న భూమికి పట్టాలు ఇవ్వాలని పలుసార్లు అధికారులకు విన్నవించుకున్నా ఆర్వోఎఫ్ పట్టాలు ఇవ్వలేదని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు కండపల్లి భీముడు, అప్పారావు, కుమార్ పాల్గొన్నారు.

తోటపల్లి ఆలయాల అభివృద్ధికి సహకరించాలి

గరుగుబిల్లి, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి):తోటపల్లి శ్రీవెంకటేశ్వర, కోదండ రామస్వామి ఆలయాల అభివృద్ధికి సహకరించాలని దేవస్థాన అభివృద్ధి కమిటీ ప్రధాన కార్యదర్శి డాక్టర్ డి.పారినాయుడు కోరారు. గురువారం అమరావతిలోని కార్యాలయంలో రాష్ట్ర దేవాదాయ, ధర్మాదాయశాఖ కార్యదర్శి వి.వినయచంద్‌ను నిధులు మంజూరు చేయాలని వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 1973లో నిర్మించిన ఆలయాలు శిథిలావస్థకు చేరుకున్నాయని తెలిపారు.సమస్యలపై స్పందించిన కార్యదర్శి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీచేశారని చెప్పారు.

ఘనంగా బంగారమ్మతల్లి ఆలయ వార్షికోత్సవం


మట్టిగాజులతో బంగారమ్మతల్లిని అలంకరించిన దృశ్యం

సాలూరు,ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని బంగారమ్మకాలనీలో ఉన్న బంగారమ్మ తల్లి ఆలయ 18వ వార్షికోత్సవం గురువారం ఘనంగా నిర్వహించారు.తొలుత అమ్మవారిని మట్టిగాజులతో అలంకరించి,శాస్త్రోక్తంగా పూజలు, అనంతరం హోమం నిర్వహించారు.

26న మండల సమావేశం

కురుపాం,ఏప్రిల్17(ఆంధ్రజ్యోతి):కురుపాం మండలసమావేశం ఈనెల 26న నిర్వహించనున్నట్లు ఎంపీడీవో జె.ఉమామహేశ్వరి ఒక ప్రకటనో తెలిపారు. ఎంపీపీ శెట్టి పద్మావతి అధ్యక్షతన జరిగే సమావేశంలో అభివృద్ధి కార్యక్రమాలు, సమస్యలపై అన్ని శాఖల అధికారులతో చర్చ జరుగుతుందని పేర్కొన్నారు.

వాహనాల తనిఖీ

పార్వతీపురం,ఏప్రిల్17(ఆంధ్రజ్యోతి): పార్వతీపురంలోని ఆర్టీసీ కాంప్లెక్స్ కూడలి గురువారం రాత్రి తొమ్మిది గంటల సమయంలో ఎస్పీ వి.మాధవ్‌రెడ్డి వాహనాలు తనిఖీచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాత్రి సమయంలో పోలీసులు జిల్లా కేంద్రంతోపాటు అనేక ప్రాంతాల్లో తనిఖీలువిస్తృతంగా చేపడుతున్నట్లు తెలిపారు.

నిత్యావసరాల పంపిణీ

జియ్యమ్మవలస, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని టీకే జమ్ము పంచాయతీ గిరిజనులకు ఎట్టకేలకు నిత్యావసర సరుకులు పంపిణీ చేపట్టారు.గురువారం కాంట్రాక్టు సేల్స్‌మెన్ జీలకర్ర గోపాలరావు ఎండీయూ వాహనం ద్వారా రేషన్ పంపిణీ ప్రారంభించారు.డీఆర్ రేషన్‌డిపోనంబరు 4027 పరిధిలో టీకేజమ్ము, గోర్లి,గోర్లివలస, కూటం, పాండ్రసింగి, కోడిపిల్లగూడ, జమ్మువలస, చినదోడిజ, పెదదోడిజ గ్రామాల్లో 563రేషన్ కార్డులు ఉన్నాయి. వీరికి ఏప్రిల్ నెలకు సంబంధించి ఈకేవైసీ ఆలస్యం కావడంతో రేషన్ పంపిణీ నిలిచిపోయింది. ఈనేపథ్యంలో ఉన్నతాధికారుల ఆదేశాలమేరకు గురువారం రేషన్‌పంపిణీ ప్రారంభమయ్యింది. మరో రెండు రోజుల్లో పంపిణీ ప్రక్రియ పూర్తి చేస్తామని సేల్స్‌మెన్ జీలకర్ర గోపాలరావు తెలిపారు. మే నెల నుంచి యథావిధిగా రేషన్ పంపిణీ ఒకటో తేదీ నుంచే ప్రారంభిస్తామని చెప్పారు.

రిజర్వేషన్ల ఆమోదంపై హర్షం

పాలకొండ, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి):ఎస్సీ వర్గీకరణ రిజర్వేషన్లను రాష్ట్ర మంత్రి వర్గం ఆమోదం తెలపడంపై టీడీపీ నాయకులు హర్షం వ్యక్తంచేశారు.ఈ మేరకు గురువారం పాలకొండ టీడీపీ కార్యాలయంలో నిర్వహించిన ఓ కార్యక్రమంలో కౌన్సిలర్లు ఆకుల మల్లేశ్వరి తదితరులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమం మార్కెట్ కమిటీ డైరెక్టర్లు కొప్పర సుభాషిణి, మూర మోహన్‌రావు, ఆకుల కుమార్ తదితరులు పాల్గొన్నారు.